విద్యార్థులకు నాణ్యమైన విద్య

● కలెక్టర్ రంజిత్ బాషా



హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతి సౌకర్యాలను అందించాలని కలెక్టర్ రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం కల్లూరు మండలం చిన్నటేకూరులో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర జూనియర్ కళాశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. కళాశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న వసతి సౌకర్యాలు, విద్యాబోధన గురించి ఆరా తీశారు. పిల్లలు నిద్రించేందుకు అదనంగా రెండు గదులను ఏర్పాటు చేసేందుకు నివేదికలు తయారు చేసి పంపించాలని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల కళాశాలల కోఆర్డినేటర్ శ్రీదేవిని ఆదేశించారు. కళాశాలల్లో కొన్ని గదుల్లో పైకప్పు పాడైనందున వాటితో పాటు అవసరమైన ఇతర మరమ్మతులకు ఎస్టిమేట్ వేసి పంపించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆర్వో మినరల్ వాటర్ ప్లాంటును ఏర్పాటు చేయాలని కోఆర్డినేటర్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, కలెక్టర్ అందుకు స్పందిస్తూ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులకు గణితం, అధ్యాపకులు బోధిస్తున్న తరగతి గదిలో విద్యార్థితో పాటు కలెక్టర్ వెనుక కూర్చుని గణితం పాఠ్యాంశాలను విన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చూడాలని అధ్యాపకులకు సూచించారు. అలాగే మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించా లన్నారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులు, ప్రిన్సిపాల్ వేణుగోపాల్, మహేశ్వరప్ప, చైర్మన్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉరుకుంద ఆలయ ఈవోపై ఫిర్యాదు



ఫిర్యాదు చేసిన విద్యుత్ శాఖ ఏఈ నరసన్న

కౌతాళం, జూలై 23(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ ఈవో మేడేపల్లి విజయరాజుపై ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు కౌతాళం మండల విద్యుత్ ఏఈ నరసన్న ఫిర్యాదు చేశారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో స్వామి వారి శ్రావణ మాసపు ఉత్సవ ఏర్పాట్లలో భాగంగా భక్తుల సౌకర్యార్థం విద్యుత్ పనులు చేపడుతున్నామన్నారు. ఈవో తాను చెప్పినట్లు పనులు చేయాలని తమపై అధికారం చెలాయించడం ఏమిటని ప్రశ్నించారు. మీరు చెప్పినట్లు నేను చేయనని తెలుపగా విధుల నుంచి తొలగిస్తానని తనను కించపరిచేలా మాట్లాడటం బాధాకరమన్నారు. ఈఘటనను తమ శాఖ అధికారులకు తెలిపి ఆదోని సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. తాను కూడా మండలస్థాయి అధికారినని ఈవో తనపై అనుచితంగా ప్రవర్తించడం తగదని అన్నారు. ఇప్పటికైనా ఆ శాఖ ఉన్నతాధికారులు ఆలయ ఈవోపై చర్యలు తీసుకోవాలని కోరారు.



జగన్ పాపం.. రైతులకు శాపం..!

● ఏడాది దాటినా అన్నదాతలకు తీరని రీసర్వే కష్టాలు
● దశాబ్దాలుగా సాగులో.. భూమి కొలతల్లో తేడాలు
● జాయింట్ ఎల్‌పీఎంలతో తీవ్ర సమస్యలు
● తహసీల్దారు కార్యాలయాల చుట్టూ బాధిత రైతులు
● పథకాలను కోల్పోతున్న అర్హులు

● ఓర్వకల్లు మండలం సోమయాజులపల్లె గ్రామంలో ఓ రైతు 40 ఏళ్ల క్రితం మూడెకరాలు కొనుగోలు చేశారు. అప్పటి ప్రభుత్వ సర్వేయర్‌తో సర్వే చేయించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. నాటి నుంచి వారి అనుభవంలోనే ఉంది. పట్టాదారు పాసు పుస్తకాలు తీసుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన రీసర్వేలో 2.40 ఎకరాలే ఉన్నట్లు చూపారు. క్షేత్రస్థాయిలో మూడెకరాలు భూమి ఉన్నా, సర్వేలో 60 సెంట్లు మాయం చేశారు. తేడా ఎందుకొచ్చింది? సరిచేయమని గ్రామ సర్వేయర్, వీఆర్వో, తహసీల్దారును అడిగితే పొంతనలేని సమాధానాలు చెబుతున్నారు.

● వెల్దుర్తి మండం కృష్ణాపురం గ్రామంలో 60 ఏళ్ల క్రితం ప్రభుత్వ భూమిని అసైన్‌మెంట్ చేసి భూమి లేని నిరుపేదలకు డి-పట్టా ఇచ్చారు. అందులో భాగంగానే కురవ మల్లేశ్వరి పేరిట సర్వే నంబరు.557లో 1.74 ఎకరాలు ఇచ్చారు. రీసర్వేలో జాయింట్ ఎల్‌పీఎం నంబరు 1662 కింద ఆమె పేరిట 325 ఎకరాలు ఉన్నట్లు చూపించారు. సర్వే అధికారుల మాయాజాలం వల్ల వ్యవసాయ కూలీ భూమి ఆన్‌లైన్ రికార్డుల్లో మూడు వందల ఎకరాలకు పైగా భూస్వామిగా మారిపోయింది. కొడుకు కూతురుకు రావాల్సిన 'తల్లికి వందనం' సాయం రూ.26 వేలు ఖాతాలో జమ కాలేదు.

ఇలా ఒకరిద్దరు కాదు.. జిల్లాలో రీసర్వే జరిగిన గ్రామాల్లో వేలాది మంది బాధితులు ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వం చేసిన రీసర్వే పాపం రైతులకు శాపాలై వెంటాడుతోంది. కష్టజీవులకు అవస్థలు, కష్టాలు మిగిల్చింది. ఐదారుగు రైతులకు చెందిన భూములకు ఒకే 'జాయింట్ ఎల్‌పీఎం నంబరు' ఇవ్వడం, ప్రతి రైతు పేరిట మొత్తం భూమిని చూపడంతో 'తల్లికి వందనం' అందుకోలేకపోయారు. తాజాగా అననదాత సుఖీభవ - పీఎం కిసాన్ సాయం కోల్పోయే పరిస్థితి వచ్చింది. భూ కొలతల్లో భారీ తేడాలు చూపడంలో గ్రామాల్లో న్యాయ సమస్యలు తలెత్తుతున్నాయి. ఇదే అదనుగా భావించిన రెవెన్యూ అధికారులు రికార్డులు సరిచేసే క్రమంలో లంచాల రూపంలో పిండేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో లక్షకు పైగా రీసర్వే బాధిత రైతులు ఉన్నట్లు అంచనా. ఆ వివరాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

కర్నూలు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నెలకొన్న భూ వివాదాలు పరిష్కరించే లక్ష్యంగా గత వైసీపీ హయాంలో 'భూముల రీసర్వే'కు శ్రీకారం చుట్టింది. నాడు జగన్ ప్రభుత్వం చేపట్టిన రీసర్వే పాపాలు ఏడాది దాటినా రైతులను వెంటాడుతూనే ఉన్నాయి. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మూడు విడుతల్లో రీసర్వే చేశారు. 48,514 జాయింట్ ఎల్‌పీఎం నంబర్లు పరిధిలో 1,37,979 మంది రైతుల ఖాతాలు ఉన్నాయి. కర్నూలు జిల్లాలో 252 గ్రామాల్లో రీసర్వే చేశారు. 21,588 జాయింట్ ఎల్‌పీఎం నంబర్లు పరిధిలో 61,817 రైతుల ఖాతాలున్నాయి. 1907లో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం భూములు రీసర్వే చేసింది. భూమి రికార్డులు, విస్తీర్ణానికి సంబంధించి పక్కా వివరాలతో రీ-సెటిల్‌మెంట్ రిజిస్టర్(ఆర్ఎస్ఆర్)ను రూపొందించింది. స్వాతంత్ర్యం అనంతరం భూముల క్రయవిక్రయాలు, అన్నదమ్ముల విభాగాలు దృష్ట్యా సరిహద్దుల మార్పు జరిగాయి. వాటిని సరి చేస్తూ 1979లో భూమి హక్కులు, యాజమాన్య వివరాలతో రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్‌వోఆర్) తీసుకొచ్చింది. భూములకు సంబంధించిన కీలకపత్రం ఇది. ఒక సర్వే నంబరులో ఎంత భూమి ఉంది..? యాజమాన్యం హక్కులు ఎవరి పేరిట ఉన్నాయి..? కచ్చితంగా చెప్పే రికార్డు ఇది. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో భూ వివాదాలు పరిష్కారం పేరిట రీసర్వేకు శ్రీకారం చుట్టింది. అయితే రీసర్వేలో ఆర్‌వోఆర్‌కు బదులుగా బ్రిటీష్ కాలం నాటి ఆర్ఎస్ఆర్ రికార్డులను పరిగణలోకి తీసుకోవడం, గ్రామ సచివాలయ సర్వేయర్లకు రీసర్వేపై సరైన అవగాహన లేకపోవడం వెరసి తప్పుల తడకగా మారింది. ముఖ్యంగా దశాబ్దాల కాలంగా అమలులో ఉన్న సర్వే నంబర్ల స్థానంలో జాయింట్ ల్యాండ్ పార్సిల్ మ్యాప్ (ఎల్‌పీఎం)లను తీసుకొచ్చారు. 118 ఏళ్ల నాటి ఆర్ఎస్ఆర్ రిజిస్టర్ ప్రకారం సర్వే నంబరు స్థానంలో జాయింట్ ఎల్‌పీఎం నంబరు ఇవ్వడంతో సమస్యలు తలెత్తాయి. ఉదాహరణకు.. నాడు ఓ రైతుకు ఓ సర్వే నంబరులో 25 ఎకరాలు ఉంటే, వారసత్వంగానో, క్రయవిక్రయాల వల్లనో ప్రస్తుతం ఐదారుగు రైతుల పేరిట మారింది. సబ్ డివిజన్ పరిగణలోకి తీసుకోకుండా మొత్తం 25 ఎకరాలకు ఒకే జాయింట్ ఎల్‌పీఎం నంబరు ఇచ్చారు. దీంతో భూమి లేకపోవడంతో పాటు ఉన్న ప్రభుత్వ పథకాలు సైతం అందకుండాపోతున్నాయి.



ఫిర్యాదు చేయడానికి వచ్చిన కృష్ణాపురం రీసర్వే బాధితులు (ఫైల్)

● ఆందోళనలో బాధిత రైతులు

జిల్లాలో ఫేజ్-1 కింద 67 గ్రామాల్లో 1,25,260.98 ఎకరాలు, ఫేజ్-2 కింద 21 గ్రామాల్లో 73,060.05 ఎకరాలు, ఫేజ్-3 కింద 164 గ్రామాల్లో 5,37,180.28 ఎకరాలు కలిపి 252 గ్రామాల్లో 7,45,501.316 ఎకరాలు రీసర్వే చేశారు. 61,817 మంది రైతుల ఖాతాలకు 21,588 జాయింట్ ఎల్‌పీఎం నంబర్లు ఇచ్చారు. సర్వే నంబరు స్థానంలో జాయింట్ ఎల్‌పీఎం నంబర్లు తీసుకురావడం, ఐదారుగురు రైతుకు ఒకే ఎల్‌పీఎం నంబరు ఇవ్వడంతో సమస్యలు చుట్టిముట్టాయి. ఒక ఎల్‌పీఎం నంబరులో ఐదురుగురు రైతులకు 25 ఎకరాలు ఉంటే, ఏ రైతు పేరిట ఎంత భూమి ఉందో అంతే చూపాలి. ఇందుకు విరుద్ధంగా మొత్తం రైతులకు 25 ఎకరాలు చొప్పున వారి పేరిట చూపిచడం వల్ల అర్హులు కూడా సంక్షేమ పథకాలకు అనర్హులు అవుతున్నారు. క్షేత్రస్థాయిలో ఉన్న భూమి విస్తీర్ణం కంటే ఎక్కువ తక్కువలు రికార్డుల్లో చూపడం వల్ల గ్రామాల్లో న్యాయపరమైన సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి.

రికార్డులు సరి చేసేందుకు మామూళ్లు..!



ఆలూరులో ఫిర్యాదు చేస్తున్న రీసర్వే బాధిత రైతులు (ఫైల్)

రీసర్వే వల్ల తలెత్తిన సమస్యను పరిష్కరించమని బాధిత రైతులు వీఆర్‌వోలు, గ్రామ సచివాలయ సర్వేయర్లు, తహసీల్దారు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. చేసిన తప్పులు సరిచేయాల్సిన రెవెన్యూ అధికారులు ఇది తన పరిధిలో లేదు.. సబ్ కలెక్టర్/ఆర్డీవో, జాయింట్ కలెక్టర్ (జేసీ) పరిధిలో ఉందంటూ కాలయాపన చేస్తున్నారు.

మిగతా 6వ పేజీలో

రాష్ట్రంలో బీజేపీ బలోపేతం

● రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్దన్ రెడ్డి



మాట్లాడుతున్న విష్ణువర్దన్ రెడ్డి

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీజేపీ బలోపేతం అవుతోందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమగుట్ట విష్ణువర్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం కర్నూలు నగరంలోని మౌర్యఇన్ హోటల్‌లోని పరిణయహాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పీవీ ఎన్ మాధవ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి పర్యటన రాయలసీమలో ఉండబోతోందన్నారు. ఈ నెల 26న సాయంత్రం 6 గంటలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కడపకు చేరుకుని 27న కడప జిల్లాలో పర్యటిస్తారన్నారు. అలాగే 28న నంద్యాల, 29న కర్నూలులో పర్యటిస్తారన్నారు. జగన్ పాలనలో రాష్ట్రం ధ్వంసమైందన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం పూర్తి సహకారం అందిస్తోందన్నారు. టీటీడీలో పని చేసే ఇతర అన్యమతస్థులు స్వచ్ఛం ధంగా ఉద్యోగాల నుంచి వైదొలగాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఏపీ జలాల విషయంలో లేనివివాదాలు సృష్టిస్తోందన్నారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌నాయుడు, బీజేవైఎం సురేష్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగరాజు యాదవ్, పురు షోత్తంరెడ్డి, ప్రేమ్ కుమార్, రామస్వామి, మదనమోహన్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో నేటి నుంచి వర్షాలు

● కేవీకే ప్రధాన శాస్త్రవేత్త రాఘువేంద్ర చౌదరి

ఎమ్మిగనూరు రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో గురువారం నుంచి 28వ తేదీ వరకు వర్షాలు కురిసే అవకాశముందని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రధాన శాస్త్ర వేత్త డాక్టర్ రాఘువేంద్ర చౌదరి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 24వ తేదీ 10 మి.మీ., 25న 10 మి.మీ, 26న 20మి.మీ, 27న 12మి.మీ, 28వ తేదీ 12మి.మీ వర్షపాతం నమోద య్యే సూచనలు ఉన్నాయన్నారు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 30.6 డిగ్రీల సెల్సియస్ నుంచి 31.5 డిగ్రీల సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 23.8 నుంచి 24.3 డిగ్రీల సెల్సియస్ ఉంటుందన్నారు. నైరుతి దిశగా గంటకు 10 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉందన్నారు. కంది పంటను సాగు చేసుకునే రైతులు వర్షాలను దృష్టిలో ఉంచుకొని పంటలను సాగుచేసుకోవాలని ఆయన కోరారు.

జీజీహెచ్‌లో స్కానింగ్ సమస్యలు



స్కానింగ్ కోసం చీటీలు పట్టుకున్న గొడవ చేస్తున్న రోగులు

కర్నూలు హాస్పిటల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు, జబ్బుల నివారణ కోసం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వస్తున్న రోగుల అవస్థలు వర్ణణాతీతంగా మారాయి. అందులోనూ స్కానింగ్ కోసం వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం 9 గంటల నుంచి ఓపీ ఉంటుంది. ఓపీకి వెళ్లిన రోగులకు వైద్యులు పరిశీలించి వారికి అవసరమైతే అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్ష రాస్తారు. ఈ పరీక్ష కోసం వెళ్తే రోగులకు చుక్కలు చూపిస్తున్నారు. బుధవారం పాత రేడియాలజి సర్జికల్ ఓపీ నెంబర్ (14) పక్కన ఉన్న అల్ట్రాసౌండ్ స్కానింగ్ (నెంబరు.4) దగ్గర రోగులు గొడవ పడ్డారు. 100 మంది పరీక్షల కోసం వస్తే 30 మందికి మాత్రమే టోకెన్లు ఇచ్చారని, ఇంకా ఎన్నిసార్లు ఈ పరీక్షల కోసం తిరగాలంటూ సిబ్బందితో గొడవకు దిగారు. 30 టోకెన్లకు మాత్రమే పరీక్షలు చేస్తామని విద్యార్థులకు పరీక్షలు ఉన్నాయనీ, రేడియాలజీ వైద్యులు చెప్పడంతో రోగులు గంటల తరబడి పరీక్షల కోసం నిరీక్షించారు. ఇక్కడ న్యూడయోగ్నస్టిక్ బ్లాక్ వద్ద కూడా స్కానింగ్ టోకెన్ల కోసం ఇదే పరిస్థితి నెలకొంది.

గ్రామీణ రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): గ్రామీణ రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. బుధవారం కల్లూరు మండలం కొంగనపాడులో ఎమ్మెల్యే బీటీ రోడ్డు, సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా రహదారులు అధ్వానంగా మారాయని, కూటమి ప్రభుత్వం రహదారుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందన్నారు. అందులో భాగంగా బెంగళూరు జాతీయ రహదారి నుంచి 4 కిలో మీటర్ల మేర రూ.3.31 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి చేశామన్నారు. అలాగే కొంగనపాడు గ్రామంలో రూ.45లక్షలతో పూర్తి చేసిన 5 సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ నాగిరెడ్డి, ఏఈలు హనుమంతరెడ్డి, రవిమోహన్‌రెడ్డి, ఏపీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డి.రామాంజనేయులు, ఏపీ టూరిజం డైరెక్టర్ ముంతాజ్‌బేగం, టీడీపీ నాయకులు టి.వినోద్‌కుమార్, నాగయ్య, గోరంట్ల, లక్ష్మయ్య, మురళి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువులను వాడండి

రైతులకు జేడీ వరలక్ష్మి విజ్ఞప్తి

కర్నూలు అగ్రికల్చర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రసాయనిక ఎరువులకు బదులుగా రైతులు తమ పొలాల్లో పచ్చిరొట్ట, జీవన ఎరువులను వాడడం ద్వారా భూమి సారవంతం అవుతుందని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు. మోతాదుకు మించి రైతులు రసాయనిక ఎరువులను విపరీతంగా వాడడం వల్ల పంట ఉత్పత్తులు దెబ్బ తింటాయన్నారు. రైతులు తప్పనిసరిగా పచ్చిరొట్ట ఎరువుల వాడకాన్ని అలవాటు చేసుకుంటే ఖర్చు లు తగ్గడమే కాకుండా నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చన్నారు. పచ్చిరొట్ట సాగుతో 25 శాతం రసాయనక ఎరువుల వినియోగం తగ్గుతుందన్నారు. జీవన ఎరువులను వినియోగిస్తే పది శాతం రసాయనక ఎరువుల వినియోగం తగ్గుతుందన్నారు. ఈ విషయాన్ని రైతులకు అలవాటు చేసేందుకు క్షేత్ర స్థాయిలో మండల వ్యవసాయా ధికారులు, విస్తరణాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

స్వర్ణరథంపై ఆది దంపతులు

శ్రీశైలంలో ఘనంగా ఆరుద్ర నక్షత్ర వేడుకలు



నంద్యాల కల్చరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైలంలో మల్లికార్జునస్వామి, భ్రమరాంబికదేవి బుధవారం స్వర్ణరథంపై భక్తులకు దర్శనమిచ్చారు. శివయ్య జన్మనక్షతం ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని ఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు చేపట్టారు. మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు స్వామి అమ్మ వార్లకు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను బంగారురథంపై అధిష్ఠింపజేశారు. భక్తుల శివనామస్మరణతో వేదమంత్రాల నడుమ గంగాధర మండపం నుంచి నంది మండపం వరకు స్వర్ణరథోత్సవాన్ని నిర్వహించారు. కళాకారులు కోలాటం, తప్పెట, బిందు మొదలైన కళారూపాలు ప్రదర్శి స్తుండగా రథోత్సవం కోలాహలంగా సాగింది. ఈ వేడుకకు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.



రథోత్సవం ఎదుట కళాకారుల ప్రదర్శన

రిటైర్డ్ సీటీవో చేతివాటం

జీడీపీకి నీటి విడుదల చేయండి

• హంద్రీనీవా నీటితో 68చెరువులను నింపాలి
• కలెక్టర్ రంజిత్ బాషా

7

3,500 ఎకరాల్లో పండ్ల తోటల సాగు లక్ష్యం

ఉపాధి పీడీ సూర్యనారాయణ


మాట్లాడుతున్న ఉపాధిహామీ పీడీ సూర్యనారాయణ

చాగలమర్రి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో 3,500 ఎకరాల్లో పండ్ల తోటల సాగు లక్ష్యంగా ఉందని ఉపాధి హామీ పీడీ సూర్యనారాయణ తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 2,500 ఎకరాల్లో పండ్ల తోటల సాగుకు రైతులు ముందుకు వచ్చారని అన్నారు. 100 శాతం సబ్సిడీతో మూడేళ్ల పాటు ఉపాధి నిధులు ఖర్చు చేశారన్నారు. పండ్ల తోటల సాగుతో రైతుల జీవనోపాధి పెరుగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పండ్ల తోటల సాగుకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. 800 మినీ గోకులాల షెడ్లు పూర్తయ్యాయన్నారు. కొత్తగా 600 మినీ గోకులాలు మంజూరైనట్లు తెలిపారు. గ్రామాల్లో 60 వేల కాంపోస్టు పిట్స్ లక్ష్యం ఉందని అన్నారు. ఉపాధి పనులు చేసే కూలీలకు ప్రభుత్వం రూ.307 కేటాయించిందని అన్నారు. ప్రస్తుతం కూలీలకు రూ.262 మాత్రమే పడుతుందని అన్నారు. 4.50 లక్షల జాబ్‌కార్డులు ఉన్నాయని అన్నారు. 45 లక్షల పనిదినాలు కల్పించామని అన్నారు. 17 మంది ఎఫ్‌లు, 7 మంది టీఏలకు షోకాజ్ నోటీసులు ఇచ్చామని, ఏడుగురు ఎఫ్ఏలను తొలగించామన్నారు. సామాజిక తనిఖీలో జరిగిన అవినీతి రూ.6.70 లక్షలకు గాను రూ.3.50 లక్షలు రికవరి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారిణి అన్వర్‌బేగం, ఏపీడీ సాంబశివరావు, హెచ్ఆర్ మేనేజర్ షిబా, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

పర్యాటకానికి గ్రహణం..!

అవుకు రిజర్వాయర్.. చుట్టూ ఎత్తైన కొండలు.. సహజ సిద్ధమైన పచ్చటి ప్రకృతి అందాలు.. ఆహ్లాదకరమైన వాతావరణం మధ్య నిర్మితమైన ఈ రిజర్వాయర్ పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ఇక్కడి నుంచి కేవలం 13 కిలోమీటర్ల దూరంలోనే ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన బెలుం గుహలు ఉన్నాయి. దీంతో అవుకు రిజర్వాయర్ అందాలు పర్యాటకులను విశేషంగా ఆకర్షించేవి. 2018లో రెస్టారెంట్ భవనాన్ని పూర్తిచేశారు. రిజర్వాయర్‌లో బోటింగ్ కూడా ఏర్పాటుచేయటంతో ప్రతిరోజు వందలాది మంది పర్యాటకుల రాకతో రెస్టారెంట్ భవనం కళకళలాడేది. రెండేళ్ల క్రితం జరిగిన ఓ దుర్ఘటనతో అవుకు రిజర్వాయర్ వద్ద పర్యాటకానికి గ్రహణం పట్టుకుంది. రెస్టారెంట్, బోటింగ్ పూర్తిగా మూసివేశారు. సీఎం చంద్రబాబునాయుడు పర్యాటకానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నా కొందరు అధికారుల నిర్లక్ష్యంతో ఆశయం నీరుగారిపోతుంది. రెస్టారెంట్ భవనానికి భద్రత కరువైంది. ఆకతాయిలు, మందుబాబులు రెస్టారెంట్ భవనాన్ని అడ్డాగా చేసుకొని అసాంఘిక కార్యకలాపాలకు తెరలేపారు.


రిజర్వాయర్ వద్ద నిర్మించిన పర్యాటక భవనం


కూలిపోయిన ముఖద్వారం


దుండగులు అపహరించుకుపోయిన కిటికీలు

- 2010లో అవుకు రిజర్వాయర్ నిర్మాణం
- రివర్‌వ్యూ రెస్టారెంట్ నిర్మాణం, బోటింగ్‌క్లబ్ ఏర్పాటు
- 2023లో బోటింగ్ చేస్తూ ముగ్గురి మృతి
- వైసీపీ హయాంలో మూసివేత
- శిథిలావస్థకు చేరిన భవనాలు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం

అవుకు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అవుకు రిజర్వాయర్ వద్ద పర్యాటకానికి గ్రహణం పట్టుకుంది. 2010లో రిజర్వాయర్ 4.148 టీఎంసీలు నీటినిల్వ సామర్థ్యంతో ఈ రిజర్వాయర్‌ను నిర్మించారు. 2016లో సీఎంగా ఉన్న చంద్రబాబు నాయుడు 'పల్లెనిద్ర-నీరుచెట్టు' లో భాగంగా అవుకు రిజర్వాయర్‌లో అంతర్భాగమైన తిమ్మరాజు చెరువుకట్టపై రాత్రి బస చేశారు. నాటి బనగానపల్లె ఎమ్మెల్యే, ప్రస్తుత మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి రిజర్వాయర్ వద్ద బోటింగ్ క్లబ్ అండ్ రివర్‌వ్యూ రెస్టారెంట్ భవనాన్ని ఏర్పాటుచేసే విధంగా సీఎంను ఒప్పించారు. రూ.2కోట్లు నిధులు మంజూరు చేయించి 2018లో రెస్టారెంట్ భవనాన్ని పూర్తిచేశారు. రిజర్వాయర్‌లో బోటింగ్ కూడా ఏర్పాటుచేయటంతో ప్రతిరోజు వందలాది మంది పర్యాటకుల రాకతో రెస్టారెంట్ భవనం కళకళలాడేది. రెస్టారెంట్ భవనంలో విశ్రాంత గదులు ఏర్పాటు చేయటంతో దూరప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు బోటింగ్ చేసిన అనంతరం సేదతీరుతూ ప్రకృతి అందాలను చూసి ముగ్ధులయ్యేవారు. జిల్లాలో పర్యాటకశాఖ పరిధిలో ఉన్న వాటన్నింటినీ ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ) నిర్వహిస్తుంటుంది. ఎక్కడాలేని విధంగా అవుకు రిజర్వాయర్ వద్ద ఏర్పాటుచేసిన రెస్టారెంట్, బోటింగ్‌ను ఏపీ పర్యాటకశాఖ నేరుగా టెండర్లు నిర్వహిం చి ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించటం గమనార్హం. గతంలో నిర్వహించిన వ్యక్తులు తమకే కావాలని హైకోర్టును ఆశ్రయించటంతో టెండర్ల ప్రక్రియ ముగిసినా పునఃప్రారంభానికి నోచుకోలేదు.

నిబంధనలు గాలికొదిలేసి..

4.148 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యంతో నిండు కుండలా ఉన్న రిజర్వాయర్‌లో బోటింగ్ నిర్వహణ ఆషామాషీ కాదు. అప్పట్లో నిర్వాహకులు నిబంధనలు గాలికి వదిలేసినట్లు విమర్శలున్నాయి. 2023 మే నెల 14న బోటింగ్ ప్రమాదంలో ముగ్గురు మహిళలు ప్రాణా లు కోల్పోయారు. అప్పట్లో కోవెలకుంట్ల ఎస్‌బీ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రసూల్‌బాషా 14మంది కుటుంబ సభ్యులతో రిజర్వాయర్‌లో విహారయాత్రకు వచ్చాడు. రిజర్వాయర్‌లో బోటులో విహరిస్తుండగా అరకిలోమీటరు వెళ్లగానే బోటు బోల్తాపడింది. కుటుంబ సభ్యుల్లో హసియా, నూర్జహాన్ మృతి చెందారు. రసూల్ కుమార్తె సాజిదా రిజర్వాయర్‌లో గల్లంతైంది. మరుసటి రోజు మృతదేహాన్ని బయటకు తీశారు. ఇలా బోటు ప్రమాదంలో ముగ్గురు మహిళలు మృతి చెందగా, 11 మంది ప్రాణాలతో బయట పడ్డారు. ఈ ఘటనతో అప్పటి వైసీపీ ప్రభుత్వం బోటింగ్‌తో పాటు రెస్టారెంట్ భవనాన్ని మూసివేశారు.

నాడు కళకళ - నేడు వెలవెల

గతంలో ఇక్కడికి వచ్చే పర్యాటకుల సంఖ్య శని, ఆది వారాలతో పాటు ఇతర సెలవు దినాల్లో అధికంగా ఉండేది. రోజురోజుకు పర్యాటకుల సంఖ్య పెరగటంతో నిర్వాహ కులు స్పీడుబోటు, పెడల్‌బోటు, ఫ్యామిలీబోటు లాంటి పలు రకాల బోట్లను అందుబాటులో ఉంచి సొమ్ము చేసుకొనే వారు. రెండేళ్ల క్రితం రిజర్వా యర్‌లో బోటు బోల్తా పడి ముగ్గురు మహిళలు మృతి చెందటంతో మూసివేతకు గురై నేడు వెలవెలబోతోంది. ఆనాటి నుంచి ఆలనా పాలనా కరువై భవనం శిథిలావస్థకు చేరుకుంటుంది.


ప్రమాదానికి గురైన బోటు (ఫైల్)

భద్రత కరువు

ప్రమాదం జరిగిన రోజునుంచి మూసివేతకు గురైన రెస్టారెంట్ భవనానికి పర్యాటక శాఖ అధికారులు భద్రత కల్పించాల్సి ఉన్నా పట్టించుకోలేదు. ఇదే అదనుగా భావించిన ఆకతాయిలు, మందుబాబులు రెస్టారెంట్ భవనాన్ని అడ్డాగా చేసుకొని అసాంఘిక కార్యకలాపాలకు తెరలేపారు. భవనంలోని వాకిళ్లకు ఉన్న అద్దాలను ధ్వంసం చేసి కిటికీలు, తలుపులను అపహరించుక పో యారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని రెస్టారెంట్‌తో పాటు బోటింగ్‌ను తిరిగి ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కార్పొరేషన్‌కు అప్పగించాలి



అవుకు రిజర్వాయర్ వద్ద నిర్మించిన పర్యాటక భవనాన్ని పర్యాటకశాఖ నేరుగా టెండర్లు నిర్వహించి ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వటం సరికాదు. అవుకు రిజర్వాయర్‌వద్ద ఏర్పాటుచేసిన రెస్టారెంట్ భవనంతో పాటు బోటింగ్‌ను ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు అప్పగించాలి.

● రామకృష్ణ,ఏపీటీడీసీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు

సిబ్బంది కొరతతో భద్రత..



అవుకు రిజర్వాయర్ వద్ద మూసివేతకు గురైన రెస్టారెంట్ భవనానికి సిబ్బంది కొరత కారణంగా భద్రత కల్పించలేకపోయిన మాట వాస్తవమే. భవనంలోని వస్తువులన్నింటినీ ధ్వంసం చేశారు. పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

● సత్యనారాయణ, పర్యాటకశాఖ ఇన్‌చార్జి డీటీవో, నంద్యాల

స్విమ్మింగ్ క్రీడాకారులకు కలెక్టర్ అభినందన

కర్నూలు స్పోర్ట్స్, జూలై 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో ప్రతిభ కనబరిచిన జాతీయ స్థాయికి ఎంపికైన కర్నూలు జిల్లా క్రీడాకారులను కలెక్టర్ పి.రంజిత్ బాషా అభినందించారు. బుధవారం కలెక్టర్ చాంబరులో కలెక్టర్‌ను కలిసిన క్రీడాకారులు దేవన్షత్ సాయి, భువనాదిత్య, హేమ లత, శృతిలకు పతకాలు, సర్టిఫికెట్లు, ట్రోఫీని కలెక్టర్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని అన్నారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో భూపతిరావు, స్విమ్మింగ్ కోచ్ నటరాజ్, కర్నూలు డిస్ట్రిక్ట్ అక్వాటిక్ అసోసియేషన్ కార్యదర్శి రామకృష్ణ యాదవ్, కోశాధికారి దస్తగిరి, ఆర్గనైజింగ్ కార్యదర్శి అజయ్, జాయింట్ సెక్రటరీలు శివరాజ్, రామకృష్ణ పాల్గొన్నారు.


స్విమ్మింగ్ క్రీడాకారులతో కలెక్టర్ రంజిత్ బాషా

జింకల్లోలం

- పచ్చని పంటలపై దాడులు
- వేసిన మొక్కను వేసినట్లు తినేస్తూ..
- కర్షకులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తూ...
- ప్రతిపాదనలకే పరిమితమైన జింకల పార్కు
- ఏటా వేల ఎకరాల్లో నష్టపోతున్న రైతులు

చూడ ముచ్చటైన అందంతో చెంగుచెంగున జింకలు గంతులేస్తుంటే ఎంతో అందంగా ఉంటుంది. పచ్చని అడవుల్లో అవి పరిగెడుతుంటే ఎంతటి వారైనా వాటి విన్యాసాలకు మంత్ర ముగ్ధులవ్వాల్సిందే. అలాంటి కనువిందు చేసే కృష్ణజింకలే రైతుల పాలిట శాపంగా మారాయి. పంటలపై దాడి చేస్తూ కర్షకులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఆరుగాలం రైతులు శ్రమించి పండించిన పంటలను జింకలు నాశనం చేస్తున్నాయి. ఒక్కో గుంపులో 50నుంచి 500 జింకలు వచ్చి పొలాలపై దాడి చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. రాత్రింబవళ్లు కష్టపడి పంటలను కాపాడుకుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వం స్పందించి జింకల పార్కును ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఆదోని, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఆదోని డివిజన్‌లోని ఆదోని, ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి, హొళగుంద, హాలహర్వి, కౌతాళం మండలాల్లో జింకల బెడద అధికమైంది. నల్లరేగడి పొలాలు కావడం, తుంగభద్ర దిగువ కాలువ ఉండడంతో నీళ్లు సమృద్ధిగా దొరుకుతుండడంతో జింకల సంతతి భారీగా పెరిగిపోయింది. పంట వేసినప్పటి నుంచి చేతికొచ్చే వరకు పొలాల దగ్గర కాపలా కాసినా కానీ ఒక్కసారిగా జింకలు పంటలపై మెరుపు దాడి చేసి నాశనం చేస్తున్నాయని కర్షకులు ఆవేదన చెందుతున్నారు. కంటి మీద కునుకు లేకుండా రాత్రింబవళ్లు పొలాల గట్లపై కాపలా కాస్తూ పంటలను కాపాడుకుంటున్నామ న్నారు. ఆదోని, ఆలూరు నియోజకవర్గాల్లో జింకల సంతతి 10వేల వరకు ఉంటుందని అంచనా. జింకలను నియంత్రించే పనిలో ప్రభుత్వాలు సరైన చర్యలు తీసుకోకపోవడం వల్ల వీటి ఆవాసం పూర్తిస్థాయిలో పెరిగి రైతులను ఇబ్బందుల పాలు చేస్తున్నాయి.

పత్తి పంటపై మందలుగా వచ్చి...

వానాకాలం సీజన్‌లో రైతులు చాలామంది పత్తి, కంది పంటవైపే మొగ్గుచూపుతున్నారు. వేలల్లో పెట్టుబడులు పెట్టారు. పంటలు మొలకదశలో ఉన్నప్పుడు మందలుగా వచ్చి పొలాలపై దాడి చేస్తున్నాయి. దీంతో పంటలు మొదటి దశలోనే ధ్వంసమైపోతున్నాయి. పత్తి కాయలను, కంది బుడ్డలను సైతం వదలడం లేదు అని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒక్కసారి జింకల మంద ఆ పొలంపై పడిందంటే ఆ సంబంధిత రైతులు నష్టాలపాలు కావాల్సిందే. మొలకదశలో తినడం, మొక్కలను తొక్కి నాశనం చేస్తున్నాయి.

జింకల పార్కు ఏర్పాటుకు హామీ..

2014లో కర్నూలులో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జింకల పార్కు ఏర్పాటుకు అప్పటి సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. ఆ తర్వాత యేడాది ఆలూరు నియోజకవర్గం హొళగుంద మండలంలోని దేవరగట్టు ప్రాంతంలో జింకల పార్కు ఏర్పా టుకు 250ఎకరాల భూమిని సర్వే చేశారు. దీనికోసం గతంలో రూ.53.26 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. అటవీశాఖ అధికారులు తుంగభద్ర రిజర్వ్ ఫారెస్టు ప్రాంతంలోని 35, 36, 37 బీట్ కంపార్ట్‌మెంట్‌లో 12అడుగుల ఎత్తులో కంచె వేయాలని నిర్ణయించారు. దీనికోసం రూ.29.65 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. పార్కు ఏర్పాటు చేస్తే రూ.14.72 కోట్లు అవుతుందని, ఐదేళ్లపాటు జింకల నిర్వహణకు రూ.29.65 కోట్లు ఖర్చుఅవుతుందని ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం జింకల పార్కు దృష్టి సారించలేదు. అప్పటి కార్మిక శాఖ మంత్రిగా ఉన్న గుమ్మనూరు జయరాం కూడా పార్కు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ కూడా ఆచరణకు నోచుకోలేదు. ఇప్పుడు మళ్లీ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడంతో జింకల పార్కు ఏర్పాటుచేయాలని రైతులు కోరుతున్నారు.

రకరకాల శబ్దాలు చేయడంతో పాటు..

రైతులు ఉదయం మొదలుకుని చీకటిపడే వరకూ పంట పొలాల వద్ద కాపలా ఉండాల్సిన పరిస్థితులు ఉన్నాయి. జింకలు రాకుండా ఉండేందుకు పంటల వద్ద రకరకాల శబ్దాలు చేయడంతో పాటు రైతులే స్వయంగా మరి కొన్నిచోట్ల అరుపులు చేస్తూ, తమ పంటకు కాపలాగా ఉంటున్నారు.

పంటలు కాపాడాలి



ఆదోని డివిజన్‌లోని ప్రతి గ్రామంలో అధికంగా జింకలు గుంపులు గుంపులుగా ఉన్నాయి. ఒక్కసారి పొలంలో పడితే పంట అంతా నాశనమే. సీఎం చంద్రబాబునాయుడు జింకల పార్కును ఏర్పాటుచేసి జింకల నుంచి పంటలను రక్షించాలి.

● వీరేష్‌యాదవ్, రైతు, మదిరె గ్రామం, ఆదోని మండలం

ఏమాత్రం ఆదమరిచినా కృష్ణ జింకలు పంట పొలాల్లో చేరి అన్నదాతల ఆశలను ఆవిరి చేస్తున్నాయి.


పగటి సమయాల్లో పంట పొలాల్లో సంచరిస్తున్న జింకలు

జింకలతో రూ.వేలల్లో నష్టపోతున్నాం



మొలక దశలోనే జింకలు పంటలను తినేస్తున్నాయి. దీంతో వేలాది రూపాయలు నష్టపోతూనే ఉన్నాం. గత యేడాది రెండు ఎకరాల్లో పత్తి పంటను వేశాను. విత్తనం వేసినప్పటి నుంచి కాపు వచ్చేంతవరకు జింకల బెడద నుంచి కాపాడుకునేందుకు రాత్రి, పగలు కాపలా కాశాం. జింకలు గుంపులుగా వచ్చి పంటను తిని నాశనం చేశాయి.

- వీరేష్, రైతు, మదిరె గ్రామం, ఆదోని మండలం

రాత్రింబవళ్లు పొలాల్లోనే ఉండాల్సిన..



పంటలను జింకల నుంచి కాపాడుకోవడానికి రాత్రింబవళ్లు పొలాల్లోనే ఉండాల్సిన పరిస్థితి. అప్పటి సీఎం రాజశేఖర్‌రెడ్డి, ప్రస్తుత సీఎం చంద్రబాబునాయుడు కూడా జింకల పార్కు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటివరకు అమలు కాలేదు.

● మహదేవప్ప, చాగి గ్రామం, ఆదోని మండలం

పరిహారం అందించేందుకు చర్యలు

ప్రస్తుతం తుంగభద్ర ప్రాంతంలో జింకలు తినేందుకు ప్రత్యేకంగా పంటలు పండిస్తున్నాం. జింకల వల్ల పంటలు నష్టపోయిన రైతులు, మండల వ్యవసాయాధికారి ద్వారా పంట నష్టపోయినట్లు ధ్రువీకరణ పత్రం తెచ్చి ఇస్తే దానిని ప్రభుత్వానికి పంపుతాం. అటవీ శాఖ ద్వారా పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటాం. ● తేజస్విని, ఫారెస్ట్ రేంజ్ అధికారిణి, ఆదోని


రాత్రివేళల్లో పంట పొలాల్లో జింకలు

జగన్ పాపం.. రైతులకు శాపం..!

(5వ పేజీ తరువాయి)

కుటుంబ అవసరాల కోసం భూములు అమ్ముకున్న భూములకు రిజిస్ట్రేషన్లు జరగక, అధికారుల తప్పిదం వల్ల ఎక్కువ భూమి చూపిచడంతో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ.. వంటి సంక్షేమ పథకాల వర్తించక న్యాయం కోసం ఆఫీసులకు వెళ్తే.. ఇదే అదనుగా వేలు, లక్షల రూపాయలు ఇవ్వాలంటూ లంచం రూపంలో డిమాండ్ చేస్తున్నారు. జగన్ ప్రభుత్వంలో రీసర్వే సమస్యలు తలెత్తాయి. కూటమి ప్రభుత్వం వస్తే ఈ కష్టాలు తీరుతాయని భావిస్తే, ఏడాది గడిచినా కష్టాలు కన్నీళ్లు పెట్టిస్తున్నాయే తప్పా పరిష్కారం చేయడం లేదు.


కోడుమూరుతహసీల్దారు కార్యాలయం

పాలకుల పాపాలు.. పథకాలకు శాపాలు..

రీసర్వేలో జరిగిన లోపాల వల్ల రైతులు సంక్షేమ పథకాలకు దూరం అవుతున్నారు. లేని భూమిని ఉన్నట్లు రికార్డుల్లో చూపడంతో జిల్లాలో దాదాపు 45 వేల మందికి పైగా 'తల్లికి వందనం' సాయం అందక ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. తాజాగా అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ యోజన సాయంపై కూడా అనుమానాలు ఉన్నాయి. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో 8.65 లక్షల మంది రైతులు ఉన్నారు. వారిలో అన్నదాత సుఖీభవకు 6.28 మందిని అర్హులుగా గుర్తించారు. మరో 2 లక్షల మంది అర్హత ఉన్నా వివిధ కారణాలతో పెండింగులో పెట్టారు. రీసర్వే లోపాల వల్లే ఈ పరిస్థితి వచ్చిందని, అన్నదాత సుఖీభవ సాయం రూ.20 వేలు కోల్పోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వాస్తవాలు కొన్ని

- కోడుమూరు మండలంలో ఐదు గ్రామాల్లో రీసర్వే చేశారు. జాయింట్ ఎల్‌పీఎం నంబర్లు వల్ల లేనిభూమిని ఉన్నట్లు చూపడం, కొలతల్లో తేడాలతో న్యాయం చేయాలంటూ 4,908 బాధితులు తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. సి.బెళగల్ మండలంలో రీసర్వే చేసిన గ్రామాల్లో 55-60 శాతం మంది రైతులు బాధితులే.
- ఆదోని మండలంలో 46 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. 28 గ్రామాల్లో రీసర్వే చేస్తే, జాయింట్ ఎల్‌పీఎం, భూమి కొలతల్లో తేడాలు వంటి సమస్యలతో 878 ఫిర్యాదులు చేశారు. 278 పరిష్కరించినట్లు అధికారులు చెబుతున్నారు. 600 సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. రికార్డులకు ఎక్కని ఫిర్యాదులు వేలల్లో ఉన్నాయని ఓ వీఆర్‌వో పేర్కొనడం కొసమెరుపు.
- ఎమ్మిగనూరు మండలంలో 20 రెవెన్యూ గ్రామాలు ఉంటే 16 గ్రామాల్లో రీసర్వే చేశారు. ఇక్కడ 274 ఫిర్యాదులు రాగా, 166 పరిష్కరించామని అధికారులు చెబుతున్నారు. వీఆర్‌వోలు, గ్రామ సచివాలయ సర్వేయర్ల వద్ద మగ్గుతున్న సమస్యలు రెట్టింపు ఉన్నాయని అంచనా.
- ఆలూరు మండలం తుంబబీడు, కమ్మరచేడు, ముద్దనగేరి, కురువల్లి, కరిడిగుడ్డం, మరకట్టు గ్రామాల్లో రీ సర్వే చేశారు. జాయింట్ ఎల్‌పీఎం సమస్యలతో 700 మంది రైతులు అన్నదాత సుఖీభవకు అనర్హులు అయ్యారు.
- రీసర్వే జరిగిన ప్రతి గ్రామంలోనూ ఇలాంటి సమస్యలే రైతులను వెంటాడుతున్నాయి. ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమం నిర్వహించి రీసర్వే సమస్యలు పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

31న జిల్లాస్థాయి యోగాసన పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి యోగాసన పోటీలు జూలై 31న కర్నూలు ఔట్ డోర్ స్టేడియంలోని యోగా హాల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా యోగాసన అధ్యక్షుడు ఎస్‌వీ శివరాజు, కార్యదర్శి ప్రభాకర్ తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారు రాష్ట్ర, జాతీయ, ఒలింపిక్స్‌లో పాల్గొనడానికి అర్హులన్నారు. ఈపోటీలు 10 నుంచి 55 సంవత్సరాల వయస్సు మహిళలు, పురుషులు పాల్గొనవచ్చని అన్నారు. ట్రెడిషనల్ యోగా, ఫార్వర్డ్ బెండ్, బ్యాక్ బెండ్, ట్విస్ట్, లెగ్ బాలెన్స్, హ్యాండ్‌బాలెన్స్, సుపీనే, కళాత్మక సింగిల్, కళాత్మక పెయిర్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించబడునన్నారు. ప్రతి పోటీదారుడు తన వయస్సు బట్టి రెండు విభాగాల్లో మాత్రమే పోటీకి అనుమతించబడుతారని తెలిపారు. పోటీదారుడు తమతో పాటు తప్పనిసరిగా వయస్సు ధ్రువీకరణ, హెల్త్ సర్టిఫికెట్, ఫొటో, మెయిల్ ఐడీ, ఫోన్ నెంబర్, సెల్ఫ్‌డిక్లరేషన్, ఆధార్, రూ.50లు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలని, వివరాలకు సెల్‌నెంబర్ 9949257657ను సంప్రదించాలని కోరారు.

లభ్యంకాని మహిళ ఆచూకీ


కుమ్మరి రాజేశ్వరి (ఫైల్)

ఆలూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలం మొలగవల్లి గ్రామానికి చెందిన మహిళ కుమ్మరి రాజేశ్వరి అదృశ్యమై 14 రోజులు గడిచినా ఆచూకీ లభించలేదు. తన భార్య కనిపంచడం లేదని ఈనెల 8న భర్త ఆదినారాయణ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ మహబూబ్‌బాషా బుధవారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. కాగా బంధువులు ఓ ఉద్యోగి పాత్రపై అనుమానాలు వ్యక్తం చేయడంతో పోలీసులు సదరు ఉద్యోగిని అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 9121101158 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కోరారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం



మంత్రాలయం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం సమీపంలో తుంగభద్ర నది ఒడ్డున గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైందని మంత్రాలయం ఎస్‌ఐ శివాంజల్ తెలిపారు. బుధవారం నది ఒడ్డున తుంగభద్ర నదిలో తేలియాడుతూ మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గజ ఈతగాళ్ల ఆర్డీఎఫ్ బృందం సాయంతో మృతదేహాన్ని ఒడ్డుకు తెచ్చారు. మహిళా మృతదేహం వద్ద ఎటువంటి ఆచూకీ తెలియలేదు. మృతురాలి వయసు 55ఏళ్ల దాకా ఉండవచ్చని, నలుపు ఆకుపచ్చని చీర, అదే రంగులో జాకెట్, ఎడమ ముక్కుపుడక, జత చెప్పులు ఉన్నట్లు తెలిపారు. వీఆర్వో భీమయ్య ఫిర్యాదు మేరకు గుర్తు తెలియని మహిళా మృతదేహంగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వ్యక్తి ఆత్మహత్య

బనగానపల్లె, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాగంటిపల్లె గ్రామానికి చెందిన బోయ శ్రీనివాసులు(34) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ దుగ్గిరెడ్డి బుధవారం తెలిపిన వివరాలివీ.. శ్రీనివాసులు మద్యానికి బానిస కావడంతో పాటు ఆటో కొనుగోలుకు చేసిన అప్పులు తీసుకొని చెల్లించలేక మనస్తాపంతో ఇంట్లో ఉరి వేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె వైద్యశాలకు తరలించారు. శ్రీనివాసులు తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వైన్‌షాపులో చోరీ

కర్నూలు క్రైం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ వైన్‌షాపులో చోరీ జరిగింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఉన్న పీఆర్ వైన్ షాపులో తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు ముఖాలకు మాస్కులు ధరించి షాపులోకి చొరబడ్డారు. అనంతరం సీసీ కెమెరాల వైర్లు కట్ చేసి విలువైన మద్యం బాటిళ్లు చోరీ చేశారు. నిందితుల ఆనవాళ్లు గుర్తు పట్టకుండా మాస్కులు ధరించడంతో పాటు చేతికి గ్లౌజులు వేసుకుని చోరీకి పాల్పడ్డారు. మద్యం దుకాణం నిర్వాహకుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మట్టిమిద్దె కూలి వృద్ధురాలి దుర్మరణం


అనుగొండ గ్రామంలో కూలిన మట్టిమిద్దె

కోడుమూరు రూరల్, జూలై 23, (ఆంధ్రజ్యోతి): మట్టిమిద్దె కూలి ఓ వృద్ధురాలు దుర్మరణం చెందింది. ఈ ఘటన మండలంలోని అనుగొండలో చోటుచేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన బోయ గోవిందమ్మ(82) దివ్యాంగురాలు. గోవిందమ్మ కూతురు మాధలక్ష్మమ్మతో కలిసి నివసిస్తుంది. బుధవారం కుమార్తె తల్లికి భోజనం ఇచ్చి కూలీ పనికి వెళ్లింది. మధ్యాహ్నం రెండు గంటలకు వసారాలో పడుకున్న గోవిందమ్మపై మట్టిమిద్దె ఒక్కసారిగా కూలింది. ఇరుగుపొరుగు వారు అప్రమత్తమై పరుగున వచ్చి మట్టిని తొలగించి వెలికితీశారు. అప్పటికే గోవిందమ్మ మృతి చెందింది. విషయాన్ని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు.

అదనపు కట్నం కేసు నమోదు

ఆదోని, జూలై 23 (ఆంధ్రజ్యోతి): భర్త, అత్త అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త, అత్తపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ ఎస్‌ఐ రామస్వామి తెలిపారు. వివరాల మేరకు.. తనను వేధిస్తున్నట్లు ఎంజీ కాలనీకి చెందిన వర్షిత బుధవారం ఫిర్యాదు చేశారు. వర్షితకు బనగానపల్లె మండలం రామకృష్ణాపురంకు చెందిన సొంత అత్త కొడుకు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ప్రదీప్‌కుమార్‌తో మూడేళ్ల క్రితం వివాహం చేశారు. వివాహ సమయంలో రూ.8 లక్షలతో పాటు 22 తులాల బంగారం ఇచ్చారు. రెండేళ్లు బాగానే ఉన్నారు. అయితే తాను బీటెక్ చదివి ఉద్యోగం చేయాలని వర్షిత పెళ్లికిముందే కోరడంతో అంగీకరించిన భర్త, అనంతరం ఒప్పుకోలేదు. అలాగే మరో రూ.4 లక్షలు అదనపు కట్నం తీసుకురావాలని, పొలం కూడా తనకు రాసివ్వా లని వేధించాడు. తనకు సంతానం కలగలేదంటూ రోజూ మానసికంగా హింసించడం తోపాటు, దాడి చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొంది. ఇప్పటికే ఓసారి వర్షిత ఫిర్యాదు మేరకు హైదరాబాద్‌లో కౌన్సెలింగ్ కూడా ఇచ్చారు. అయినా భర్తలో మార్పు రాకపోవడంతో అక్కడి పోలీసుల సూచన మేరకు ఆదోనిలో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు భర్త ప్రదీప్‌కుమార్‌పై వరకట్నపు వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

టీడీపీ నాయకుడిపై దాడి

నంద్యాల టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నంద్యాల 38వ వార్డు వైఎస్సార్ నగర్‌కు చెందిన టీడీపీ నాయకుడు ప్రసాదరెడ్డిపై గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం దాడి చేశారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. ప్రసాదరెడ్డి ఇంట్లో ఉండగా గుర్తుతెలియని వ్యక్తులు రాడ్లతో దాడి చేశారు. గాయపడిన ఆయనను చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సౌకర్యాలను వినియోగించుకోవాలి


ఆదోనిలో మాట్లాడుతున్న డీఈవో శామ్యూల్ పాల్

ఆదోని అగ్రికల్చర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులకు ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను వినియోగించుకోవాలని డీఈవో శామ్యూల్ పాల్ సూచించారు. బుధవారం రాత్రి పట్టణంలోని కస్తూర్బా పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడారు. అనంతరం పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం మెరుగుపడేలా విద్యాబోధన చేయాలని, మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. కోట్లనగర్ కేజీబీవీ జనరల్, వైఎస్ఆర్ నగర్ కేజీబీవీ మైనార్టీ విద్యాలయాల్లో సౌకర్యాలపై భోజనంపై డీఈవో సంతృప్తి వ్యక్తం చేశారు.

జీడీపీకి నీటి విడుదల చేయండి



చిన్నటేకూరు వద్ద హెచ్ఎన్ఎస్ఎస్ కాల్వలో నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా. అంగన్‌వాడీ కేంద్రంలో ఆహారాన్ని పరిశీలిస్తూ..

- హంద్రీనీవా నీటితో 68చెరువులను నింపాలి
- కలెక్టర్ రంజిత్ బాషా
- హెచ్ఎన్ఎస్ఎస్ విస్తరణ పనుల పరిశీలన

కల్లూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరానికి నీటి సమస్య తలెత్తకుండా హెచ్ఎన్ఎస్ఎస్(హంద్రీనీవా సుజల స్రవంతి) నుంచి నీరు విడుదల అవుతున్న సమయంలోనే గాజులదిన్నె ప్రాజెక్టు(జీడీపీ)కి నీటిని విడుదల చేయాలని కలెక్టర్ రంజిత్‌బాషా ఇరిగేషన్ శాఖ డీఈని ఆదేశించారు. బుధవారం కల్లూరు మండలం చిన్నటేకూరు వద్ద హంద్రీనీవా విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీటి ప్రవాహం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. గతంలో మాదిరిగానే ఈసారి కూడా హంద్రీనీవా నీటితో 68 చెరువులను కూడా నింపే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కాలువ వెంబడి ఉన్నటువంటి కృష్ణగిరి రిజర్వాయర్, పత్తికొండ రిజర్వాయర్‌లతో పాటు అన్ని తూముల ద్వారా ఆయకట్టుకు నీటిని ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఇన్‌చార్జ్ ఈఈ ప్రసాదరావు, డీఈ కొండన్న, చెన్నయ్య, కల్లూరు తహసీల్దారు కె.ఆంజనేయులు పాల్గొన్నారు.

గర్భిణులు, పిల్లలు, బాలింతల..

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, పిల్లలు, బాలింతల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ రంజిత్ బాషా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారులను ఆదేశించారు. చిన్నటేకూరులో అంగన్‌వాడీ సెంటర్‌ను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం పిల్లలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. వండిన భోజనాన్ని పరిశీలించారు. ఐసీడీఎస్ పీడీ నిర్మల ఉన్నారు.

రిటైర్డ్ సీటీవో చేతివాటం

- కొడుకుతో కలసి రోడ్డుపై అక్రమ వసూళ్లు
- కేసు నమోదు చేసిన ప్యాపిలి పోలీసులు



పోలీసుల అదుపులో నిందితులు, ఉపయోగించిన కారు

ప్యాపిలి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఆయనో రిటైర్డ్ సీటీవో (కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్). ఉన్నతమైన ఉద్యోగం చేసి సంతోషంగా ఉండాల్సిన ఆయనకు ఇంకా డబ్బుపై ఆశ పోలేదు. ఉద్యోగ సమయంలో అలవాటు కాబోలు పదవీవిరమణ పొందినా రోడ్డుపై నిలబడి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాడు. అది కూడా కుమారుడితో కలసి చేతివాటం ప్రదర్శించడం గమనార్హం. అక్రమ వసూళ్ల సమాచారం తెలుసుకున్న పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా... కర్నూలుకు చెందిన సుబ్బరాయుడు కమర్షియల్ ట్యాక్స్ అధికారిగా పనిచేస్తూ గత ఏడాది రిటైర్డ్ అయ్యాడు. అయితే సదరు అధికారి రిటైర్డ్ అయినా అక్రమ వసూళ్లను ఆపలేదు. కొన్ని నెలలుగా తన కొడుకు సురేష్‌తో కలసి డోన్, ప్యాపిలి, వెల్దుర్తి హైవేపై వాహనాలను ఆపి తాను కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ అని చెప్పి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాడు. ప్రభుత్వ అధికారులు ఉపయోగించే అంబాసిడర్ కారులో వెళ్లి తన వద్ద ఉన్న పాత ఐడీ కార్డులతో దోపిడికి తెరలేపాడు. వారంలో ఒక్కోరోజు ఓ ప్రాంతంలోని హైవేపై ఈ వసూళ్లకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

నిందితులు పట్టుబడిందిలా..

ప్యాపిలి సమీపంలోని పెద్దమ్మడాబా దగ్గర బుధవారం రిటైర్డ్ సీటీవో సుబ్బరాయుడు, ఆయన కొడుకు సురేష్ కలిసి వాహనాలు నిలిపి వాహనదారుల నుంచి డబ్బు డిమాండ్ చేశారు. అదే సమయంలో డోన్ వెహికల్ అండ్ మోటారు ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్ కూడా కొంతదూరంలో రోడ్డుపై వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ప్రతి వాహనాన్ని నిలిపి వసూళ్లకు పాల్పడటాన్ని గమనించిన ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్‌కు అనుమానం వచ్చి వారి దగ్గరకు వెళ్లారు. అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారి వివరాలను అడిగాడు. తాను సీటీవో అని సుబ్బరాయుడు గుర్తింపుకార్డు చూపించారు. అయితే వారి మాటల్లో తడబాటును గమనించిన క్రాంతికుమార్‌కు అనుమానం వచ్చింది. వెంటనే తమ సిబ్బంది సాయంతో నిందితులను ప్యాపిలి పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. పోలీసుల విచారణలో తండ్రి, కొడుకుల అక్రమ వసూళ్ల బాగోతం బయటపడింది.

తండ్రీకొడుకులపై కేసు నమోదు

అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న తండ్రి సుబ్బరాయుడు, కొడుకు సురేష్‌తో పాటు కారు డ్రైవర్ అక్షయ్‌పై కేసు నమోదు చేసినట్లు ప్యాపిలి ఎస్‌ఐ మధుసూదన్ తెలిపారు. డోన్ వెహికల్ అండ్ మోటారు ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వీరి అక్రమాలపై మరింత పూర్తి విచారణ చేస్తామని ఎస్‌ఐ మధుసూదన్ వెల్లడించారు.

విద్యార్థుల మధ్య ఘర్షణ

- ఓ స్టూడెంట్‌కు విరిగిన కాలు


కాలు విరిగిన విద్యార్థి కార్తీక్

అవుకు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లె గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణలో తొమ్మిదో తరగతి విద్యార్థి కార్తీక్ ఎడమకాలు విరిగింది. వివరాలివీ.. ఈనెల 21న విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఆడుకుంటుండగా కార్తీక్, మరో విద్యార్థి మధ్య ఘర్షణ తలెత్తింది. దీన్ని గమనించిన మరో విద్యార్థి సోదరుడు, పలువురు కలిసి కార్తీక్‌పై దాడి చేశారు. ఈ ఘర్షణలో కార్తీక్ ఎడమకాలు విరిగి కుప్పకూలిపోయాడు. బాధిత విద్యార్థి తల్లిదండ్రులు అంకన్న, లక్ష్మీదేవి పాఠశాల వద్దకు చేరుకొని పాఠశాల ఆవరణలో విద్యార్థుల మధ్య ఘర్షణ జరుగుతున్నా అడ్డుకోకపోవటం ఏమిటని ఉపాధ్యాయులను నిలదీశారు. కనీసం నడవలేని స్థితిలో ఉన్న కార్తీక్‌ను ఉపాధ్యాయులు 108 ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించకపోవటం దారుణమని అమన్నారు. తాడిపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎక్స్‌రే ద్వారా పరీక్షించగా ఎడమ కాలు విరిగినట్లు తేలింది. కాలుకు కట్టుకట్టించి ఇంటికి తీసుకొచ్చారు. ఘటన జరిగిన సమయంలో హెచ్ఎం రామస్వామి పాఠశాలలో లేనని, అవుకు ఎంఆర్‌సీ కార్యాలయానికి పని నిమిత్తం వెళ్లినట్లు చెప్పి జారుకున్నారు. నంద్యాల డీఈవో జనార్దన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎంఈవోలు శ్రీధర్‌రావు, వెంకటేశ్వరరెడ్డి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను పిలిచి విచారణ చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు విచారిస్తున్నారు.

హైరిస్క్ కేసులుంటే వెంటనే స్పందించాలి


సమీక్ష నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో పి.శాంతికళ

- డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ

కర్నూలు హాస్పిటల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గర్భవతులు హైరిస్క్‌గా గుర్తించినట్లయితే ఆశా, ఆరోగ్య కార్యకర్తలు వెంటనే స్పందించి ఆసుపత్రుల్లో చేర్పించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ ఆదేశించారు. బుధవారం ముజఫర్‌నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో జూన్ నెలలో సంభవించిన మాతృ మరణంపై కర్నూలు డీఎంహెచ్‌వో డా.పి.శాంతికళ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. క్షేత్ర స్థాయిలోని సిబ్బంది ఆశా, ఆరోగ్య కార్యకర్తలు, వైద్యాధికారులు గర్భవతులను త్వరగా గుర్తించి వారికి సరైన సమయంలో వైద్యసేవలు అందించినట్లు అయితే తల్లుల మరణాలను తగ్గించవచ్చని అన్నారు. సమీక్షలో డీఐవో డా.నాగప్రసాద్‌బాబు, డీసీహెచ్ఎస్ డా.జఫ్రుల్లా, డీపీఎంవో డా.ఉమా, కర్నూలు జీజీహెచ్ గైనకాలజీ హెచ్‌వోడీ డా.సావిత్రి, అనస్థీషియా ప్రొఫెసర్ డా.రామశివనాయక్, డీపీహెచ్ఎన్‌వో అన్నపూర్ణ, యూపీహెచ్‌సీ వైద్యాధికారులు సుప్రి, డా.జ్యోతి పాల్గొన్నారు.


మాజీ ఎంపీపై అనుచిత వ్యాఖ్యలు

- నిందితులు అరెస్టు

కర్నూలు క్రైం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడమే కాకుండా రూ.3 కోట్లు డిమాండ్ చేసిన నిందితులను టూటౌన్ పోలీసులు బుధవారం అరెస్టు చేసినట్లు సీఐ నాగరాజురావు తెలిపారు. వివరాలు.. ఒంగోలుకు చెందిన నాగాంజనేయులు, తిరుపతికి చెందిన సత్యనారాయణ, కొంగూరు మహేష్ తిరుపతిలో సీతమ్మ ఆర్యవైశ్య ధర్మసత్రం చెందిన భూములను నిందితులు కాజేయాలని చూశారు. ఆ స్థలంలో షాపులో దుకాణాలు నిర్మించి లీజుకు ఇస్తామని నమ్మించారు. పలువురి నుంచి రూ.6కోట్ల మేర వసూలు చేశారు. దీంతో ఆ ట్రస్టు ట్రెజరర్‌గా ఉన్న కర్నూలుకు చెందిన ఇల్లూరు లక్ష్మయ్య నుంచి రెండుసార్లు రూ.2.5 లక్షలు వసూలు చేశారు. ఆక్రమించిన భూములను ట్రస్టు నిర్వాహకులు స్వాధీనం చేసుకునే ప్రయత్నించారు. ఆ భూములను వదిలిపెట్టాలంటే రూ.3కోట్లు డిమాండ్ చేసినట్లు బాధితుడు లక్ష్మయ్య ఫిర్యాదు చేశారు. నిందితులు మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ నుంచి రూ.10 లక్షలు డిమాండ్ చేయగా ఆయన నిరాకరించారు. దీంతో టీజీ వెంకటేశ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ఫేస్‌బుక్, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

విభజన హామీలను తుంగలో తొక్కిన కేంద్రం

- రాజ్యసభ మాజీ సభ్యుడు తులసిరెడ్డి


ఆళ్లగడ్డలో మాట్లాడుతున్న రాజ్యసభ మాజీ సభ్యుడు తులసిరెడ్డి

ఆళ్లగడ్డ, జూలై 23(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డీఏ ప్రభుత్వం విభజన చట్టం హామీలను తుంగలో తొక్కిందని రాజ్యసభ మాజీ సభ్యుడు తులసిరెడ్డి విమర్శించారు. ఆళ్లగడ్డ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇవ్వాల్సింది కొండంత అయితే ఇచ్చింది గోరంత మాత్రమే అని అన్నారు. విభజన చట్టంలోని పోలవరాన్ని పూర్తి చేయలేదన్నారు. తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం నగరాలలోని విమానాశ్రయాలను అంతర్జాతీయ విమానాశ్రయాలుగా తీర్చిదిద్దుతామని చెప్పి విస్మరించారన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ.. టీడీపీ ఎంపీల మద్దతునే ఉందని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ తాలుకా సమన్వయకర్త హుస్సేన్‌బాషా, మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి శంషుల్‌హక్, డాక్టర్ వెస్లీ, సంజయ్‌కుమార్, మౌలానా అబ్దుల్ మజీద్ తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె: భాగవత సప్తాహం మోక్షప్రాప్తికి సోపానం అని మాజీ ఎంపీ తులసిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన యాగంటిలో నిర్వహించిన భాగవతసప్తాహం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో కంచిరెడ్డి, నారాయణరెడ్డి, బాలకృష్ణారెడ్డి, నరింహులు, బాలుయాదవ్, హుస్సేన్, శ్రీనివాసులు, అమర్, ఉత్తన్న, సుబ్బారెడ్డి, రాజు, బాబా తదితరులు పాల్గొన్నారు.

రహదారుల సమస్యలను పరిష్కరించండి


కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి సమస్యలు వివరిస్తున్న ఎంపీ

నంద్యాల రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జాతీయ రహదారుల సమస్యలను పరిష్కరించాలని కేంద్ర రవాణ శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి కోరారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలోని కేంద్ర మంత్రి కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా దేశ రాజధాని ఢిల్లీలో టీడీపీ కార్యాలయ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ కట్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

చీటింగ్ కేసులో ఇద్దరికి జైలు, జరిమానా

కర్నూలు లీగల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెడితే.. అధిక మొత్తంలో వడ్డీ ఇస్తామని చెప్పి ఫిర్యాదిని నమ్మించి మోసం చేసిన కేసులో ఇద్దరు నిందితులకు ఏడాది జైలు, రూ.10వేలు జరిమానా విధిస్తూ కర్నూలు జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎస్.అనిల్ కుమార్ బుధవారం తీర్పు చెప్పారు. స్థానిక కల్లూరుకు చెందిన ఇద్దరు నిందితులు రవికుమార్, ఉరుకుందులు కలిసి 2012 అక్టోబరు 3వ తేదీన స్థానిక ఏ.క్యాంపు చెందిన ఆరేపల్లి శైలజను కలిసి షేర్ మార్కెటింగ్ నందు పెట్టుబడి పెట్టించారు. ఆ తర్వాత నిందితుల పేర్ల మీద సెక్యూరిటీ అకౌంటు ఓపెన్ చేసి అందులో ఫిర్యాదితో రూ.10 లక్షలు పెట్టుబడి పెట్టించారు. ఆ తర్వాత ముద్దాయిలు ఆ సెక్యూరిటీ అకౌంటును క్లోజ్ చేసి ఆ డబ్బును నిందితులు తన సొంతానికి వాడుకున్నారు. ఆ తర్వాత తాను మోసపోయాననీ తెలుసుకున్న ఫిర్యాది స్థానిక రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు నిందతులపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. నిందితులపై నేరం రుజువు కావడంతో ఒక ఏడాది జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు.

బాలగంగాధర్ తిలక్‌కు ఘన నివాళి



బాలగంగాధర్ తిలక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ తదితరులు

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): స్థానిక బీ.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో బుధవారం ప్రిన్సిపాల్ నాగ స్వామి నాయక్ అధ్యక్షతన బాలగంగాధర్ తిలక్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా బాలగంగాధర్ తిలక్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్, రిటైర్డు ప్రిన్సిపాల్ కొట్టె చెన్నయ్య, నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ రాయపాటి శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామకృష్ణ, విజయశేఖర్, మల్లికార్జున, కృష్ణమోహన్, సోమేష్, చిన్న మల్లేశ్వరుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ హాస్టళ్ల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలోని బీసీ సంక్షేమ హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారిత అధికారి ప్రసూనకు విద్యార్థి సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. వసతి కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి హాస్టల్‌లో సీటు కేటాయించాలని కోరారు. విద్యార్థులకు సన్న బియ్యం ఇవ్వాలని, అన్ని సబ్జెక్టులకు ట్యూటర్లను నియమించాలని కోరారు. రాయలసీమ విద్యార్థి జేఏసీ చైర్మన్ కోనేటి వెంకటేశ్వర్లు, బీసీ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌బాబు, బాలకృష్ణ పాల్గొన్నారు.

● రాష్ట్ర వ్యాప్తంగా కేజీ నుంచి పీజీ వరకు విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎండీ రఫీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పీవోడబ్ల్యూ కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్ర మంలో సోమశేఖర్, సాహిత్, నవీన్ కుమార్, మద్రిస్వామి పాల్గొన్నారు.

లేఅవుట్‌ను రద్దు చేయాలి: టీడీపీ



మాట్లాడుతున్న టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి

ఓర్వకల్లు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లులోని జగనన్న లేఅవుట్ సమీపంలో ఉన్న 532/సీ లేఅవుట్‌ను రద్దు చేయాలని టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి కోరారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 532/సీలో లేఅవుట్లు వేశారని, ఈ స్థలాల్లో ఇంటి పట్టాలు ఇచ్చారని అన్నారు. అయితే అప్పట్లో ఉన్న తహసీల్దార్ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే బదిలీపై వెళ్లాడు. అయితే బదిలీపై వెళ్లినా లేఅవుట్‌లో రూ.లక్షల్లో ముడుపులు తీసుకుని స్థానికేతరులకు ఇంటి పటాలు ఇచ్చారని, వీటిపై విచారణ చేపట్టి అర్హులైన లబ్ధిదారులు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని తహసీల్దార్ విద్యాసాగర్ దృష్టికి తీసుకెళ్లామని, వాటిపై విచారణ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అల్లాబాబు, అయూబ్ బాషా పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించండి: శాస్త్రవేత్త



గుడుంబాయితండాలో మొక్కజొన్న సాగుపై రైతులకు శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్త శివరామకృష్ణ

ఓర్వకల్లు, జూలై 23(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న సాగుపై రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ శివరామకృష్ణ, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ వేదమణి అన్నారు. బుధవారం మండలంలోని గుడుంబాయి తండా గ్రామంలో మొక్కజొన్న సాగుపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈకార్యక్రమానికి ఓర్వకల్లు వ్యవసాయాధికారి మధుమతి అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కజొన్న సాగులో పొలాన్ని బాగా దున్ని విత్తనాలను 2.5 సె.మీల లోతులో విత్తాలన్నారు. విత్తే సమయంలో ఎకరాకు 8 నుంచి 10 కిలోల విత్తనాలు వాడాలని, ఖరీఫ్‌లో జూలై నెలలో, రబీలో అక్టోబరు, నవంబరు నెలల్లో విత్తుకోవచ్చన్నారు. మొక్కజొన్న సాగుకు మెత్తని నేల అవసరం అని, దుక్కి దున్నేటప్పుడే నేల బాగా పొడిగా ఉండాలన్నారు. పంట మా ర్పిడి చేసేటప్పుడు ముందు సాగు చేసిన పంట అవశేషాలను తీసివేయా లన్నారు. విత్తేసమయంలో వనరుల మధ్య 60 సెం.మీల దూరం, మొక్కల మధ్య 20 సెం.మీల దూరం ఉండేలా చూసుకోవాలన్నారు. తెగుళ్లు సోకిన మొక్కలను గమనిస్తూ నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్ర మంలో ఏఈవో భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలను జయప్రదం చేయాలి

కర్నూలు అర్బన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): సీపీఐ 24వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి గిడ్డయ్య పిలుపునిచ్చారు. బుధవారం సీఆర్ భవన్‌లో సీపీఐ నగర కార్యవర్గం, ప్రజా సంఘాల నగర అధ్యక్ష, కార్యదర్శుల సమావేశం జరిగింది. గిడ్డయ్య మాట్లాడుతూ కర్నూలు జిల్లాకు ఎంతో చరిత్ర ఉందని, ఉమ్మడి జిల్లా నుంచి దేశ ప్రధాని, రాష్ట్రపతి, ముఖ్యమంత్రులను అందించినప్పటికీ జిల్లా అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆవుల శేఖర్, కె.జగన్నాథం, మునెప్ప, సోమన్న, కె.శ్రీనివాసులు, షాహీర్, గిడ్డమ్మ, భారతి, రామచంద్రుడు పాల్గొన్నారు.

సీఐటీయూ ..

ఓర్వకల్లు, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఈనెల 27న జరిగే సీఐటీయూ మండల మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా నాయకుడు శ్రీధర్ పిలుపునిచ్చారు. బుధవారం ఓర్వకల్లులోని ప్రజా సంఘాల కార్యాలయంలో సీఐటీయూ మండల అధ్యక్షులు షాజహాన్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథులుగా జిల్లా నాయకులు శ్రీధర్, మండల నాయ కులు సుధాకర్ హాజరయ్యారు. అంతకుముందు కేరళా మాజీ ముఖ్య మంత్రి అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాదైన అంగన్‌వాడీ టీచర్ల వేతనం, టీఏ, డీఏ, స్వచ్ఛభారత్, ఆశా కార్మికుల సమస్యలను ఇంత వరకు పరిష్కరించ లేదన్నారు. సీఐటీయూ మండల సభ్యులు ధనుంజయ, నాగభూషణం, రాజు, మద్దయ్య, గిడ్డయ్య పాల్గొన్నారు.

నేడు రైతుబజార్‌లో క్లీన్ అండ్ గ్రీన్

కర్నూలు అగ్రికల్చర్, జూలై 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని సి.క్యాంపు రైతుబజారులో గురువారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్టేట్ అధికారి కళ్యాణమ్మ బుధవారం తెలిపారు. రైతులు అమ్మకానికి కూరగాయలను తీసుకురావద్దని ఆమె సూచించారు.

గడియారం ఆసుపత్రికి మహర్దశ

● క్రెడాయ్ ఆధ్వర్యంలో మరమ్మతులు

● కిమ్స్ సహకారంతో ఉచిత వైద్యసేవలు

కర్నూలు న్యూసిటీ, జూలై 23(ఆంధ్రజ్యోతి): నగరంలో వందేళ్ల చరిత్ర కలిగిన గడియారం ఆసుపత్రికి మహర్దశ పట్టనుంది. ఇంత కాలం ఆసుపత్రి శిథిలావస్థకు చేరినా పట్టించుకున్ననాథుడే లేరు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ఇటీవల నగర పాలక అధికారులతో కలిసి నిర్వహించిన సమావేశంలో గడియారం ఆసుపత్రి అభివృద్ధికి పలు కీలక అంశాలను సూచించారు. ఆసుపత్రికి సంబంధించి మరమ్మతులు చేసేందుకు క్రెడాయ్‌తో సంప్రదించారు. దీంతో వాళ్లు ఒప్పుకుని అగ్రిమెంటు కూడా చేసుకున్నారు. ఆసుపత్రి చరిత్ర ఆనవాళ్లు దెబ్బతినకుండా ఆర్కే యాలజీ అధికారులతో సమన్వయం చేసుకుని వివిధ రకాల మరమ్మతులు.. ప్లాస్టింగ్ తదితర పనులు పూర్తి చేయనున్నారు. పనులు పూర్తి అయ్యాక కూడా పదేళ్లపాటు క్రెడాయ్ ఆధ్వర్యంలో చిన్న చిన్న మరమ్మతు పనులు చేసే విధంగా అగ్రిమెంటు చేసుకున్నారు. ఇప్పటికే పనులు ప్రారంభించారు. అదేవిధంగా ఆసుపత్రిలో సరైన చికిత్సలను ఉచితంగా చేసే విధంగా కిమ్స్ ఆసుపత్రి సౌజన్యం తో సంప్రదించారు. కిమ్స్ ప్రతినిధులు కూడా ముందుకు రావడంతో త్వరలో ఆసుపత్రిలో అన్ని రకాల సేవలు ఉచితంగా అందనున్నాయి. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది అంతా కిమ్స్‌కు సంబంధించినవారే ఉంటారు. వీరంతా ప్రజలకు అత్యాధునిక సేవలు అందించనున్నారు.



గడియారం ఆసుపత్రి (ఫైల్)

పనులు పూర్తి చేసేందుకు చర్యలు



గడియారం ఆసుపత్రి అభివృద్ధి పనుల త్వరలోనే పూర్తి చేసే విధంగా అన్ని రకాల చర్యలు తీసుకుంటాం. క్రెడాయ్ ఆధ్వర్యంలో మరమ్మతులు, కిమ్స్ సౌజన్యంతో వివిధ రకాల సేవలు ఉచితంగా అందించనున్నాం. కిమ్స్ సిబ్బంది ఎవరైనా ప్రజల వద్ద డబ్బులు వసూలు చేసినట్లు నిర్ధారణకు వస్తే అగ్రి మెంటు రద్దు చేస్తాం.

● విశ్వనాథ్, నగర పాలక కమిషనర్

పెద్దాసుపత్రిలో కోతుల బెడద

● ఆక్సిజన్ పైపులైన్‌ను పట్టుకుని వేలాడిన వైనం

● లీకేజీతో రోగుల భయాందోళనలు



సూపర్ స్పెషాలిటీ బ్లాక్ వద్ద ఆక్సిజన్ లీకేజీని పరిశీలిస్తున్న సీఎస్ఆర్ఎంవో డాక్టర్ వెంకటరమణ

కర్నూలు హాస్పిటల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కోతుల బెడదతో రోగులు అవస్థలు పడుతున్నారు. బుధవారం ఉదయం సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లో కొన్ని కోతులు ఆక్సిజన్ పైపులైన్ పట్టుకుని వేలాడాయి. దీంతో ఆక్సిజన్ పైపులైన్‌కు పెద్ద రంధ్రం ఏర్పడి ఆక్సిజన్ లీకేజీ కావడంతో అక్కడ పెద్దశబ్దం రావడంతో రోగులు భయాందోళన చెందారు.

అధికారులను బెదిరించే వారిని శిక్షించాలి

ఎన్జీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంగళ్‌రెడ్డి



మాట్లాడుతున్న వెంగళ్‌రెడ్డి

కర్నూలు కలెక్టరేట్, జూలై 23(ఆంధ్రజ్యోతి): అధికారులను బెదిరించే వారిని చట్ట ప్రకారం శిక్షించాలని ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి అన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనంతపురం జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడుపై జేసీ దివాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని తెలిపారు. సమావేశంలో కర్నూలు నగర అధ్యక్షుడు ఎంసీ కాశన్న, నగర కార్యదర్శి రామకృష్ణ, కర్నూలు జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి కేసీహెచ్ కృష్ణుడు, నగర కార్యవర్గ సభ్యులు ఎంకే సుజాత, విజయ్ కృష్ణ, ట్రెజరీ ఉద్యోగుల సంఘం నాయకులు మోహన్, అరవింద్ పాల్గొన్నారు.

ప్రెస్ క్లబ్‌కు ప్రభుత్వ క్వార్టర్స్ కేటాయింపు

ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రెస్ క్లబ్‌కు నగరంలోని ఏ.క్యాంపులోని 5, 6 క్వార్టర్స్ కేటాయిస్తూ కలెక్టర్ పి.రంజిత్ బాషా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం ప్రెస్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ గుప్త ప్రెస్ క్లబ్ క్వార్టర్స్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ కేటాయించినందుకు కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు. త్వరలో పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయించి కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కోశాధికారి భాస్కర్, షరీఫ్, ఫొటోగ్రాఫర్ రాము పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు న్యూసిటీ, జూలై 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్య దర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. బుధవారం పాతబస్తీలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలురు (ఉర్దూ)పాఠశాల, ప్రభుత్వ మైనార్టీ కళాశాలలను సందర్శించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ బాలికల పాఠశాలలో చెత్తాచె దారం ఉందని తక్షణమే తొలగించాలన్నారు. అదనపు గదుల నిర్మాణం మధ్యలోనే ఆగిపోయిందన్నారు. కళాశాలలో మైదానం లేకపోవడంతో విద్యా ర్థులు ఆడుకోవడానికి కష్టంగా ఉందన్నారు. బాలుర ఉర్దూ పాఠశాలలో 24 మంది టీచర్లకు 20 మంది మాత్రమే ఉన్నారని మిగిలిని వారిని తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్, షరీఫ్, పార్వతయ్య, శాలిబాషా పాల్గొన్నారు.

'ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు ఇవ్వాలి'

కర్నూలు న్యూసిటీ, జూలై 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత బస్సు అమలుతో నష్టపోతున్న ఆటో డ్రైవర్లకు నెలకు రూ.15 వేలు ఇవ్వాలని సీఐటీయూ న్యూసిటీ ప్రధాన కార్యదర్శి సీహెచ్. సాయిబాబా డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట ఏపీ ఆటో అండ్ ట్రాలీ యూనియన్ అధ్వర్యంలో ధర్నా చేపట్టారు. సాయిబాబా మాట్లాడుతూ ఆటో డ్రైవర్లను దోపిడీకి గురిచేస్తున్న ఓలా, ఉబర్, రాపిడ్ ప్రైవేట్ యాప్‌లను వెంటనే రద్దు చేయాల న్నారు. అధిక చలానాలు, ధరలు, జరి మానాలు విధించే జీవో నెంబరు 21ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ న్యూసిటీ అధ్యక్షుడు ఎస్.హుసేన్, ఆటో కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్, బి.రాధాకృష్ణ పాల్గొన్నారు.

రూ.100 కోట్ల బకాయిలు వసూలే లక్ష్యం

నగరపాలక సంస్థ కమిషనర్ విశ్వనాథ్

కర్నూలు న్యూసిటీ, జూలై 23(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థకు వివిధ రకాల పన్నుల రూపంలో వచ్చే రూ.100 కోట్ల బకాయిలను వసూలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని కమిషనర్ పి.విశ్వనాథ్ అన్నారు. బుధవారం నగర పాలక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరం అభివృద్ధి జరగాలంటే ప్రజలకు సకాలంలో అన్ని రకాల పన్నులు చెల్లించాలన్నారు. పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఆగస్టు 1 నుంచి ప్రత్యేక సెంటర్ పెట్టి వాటి ద్వారా నగరంలోని సి అండ్ డి వేస్టేజల సేకరించి జొహరాపురం డంపింగ్ యార్డు వద్ద ఉన్న సీఅండ్‌డీ వేస్టేజ్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌కు తరలి స్తామన్నారు. తద్వారా రీసైక్లింగ్ ప్రక్రియ చేపట్టి పునిర్వనియోగానికి చర్యలు తీసుకుంటామన్నారు. నగరంలో అర్హులందరూ ఇళ్ల కోసం దర ఖాస్తు చేసుకోవాలన్నారు. నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

పచ్చదనం పెంపునకు ప్రాధాన్యం: నగరంలో పచ్చదనం పెంచేందుకు అధిక ప్రాధాన్యమివ్వాలని నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. బుధవారం పెద్ద మార్కెట్, పాతబస్తీ, సి.క్యాంపు, బిర్లా కాంపౌండు ప్రాంతాల్లోని పలు పార్కులను ఆయన పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో నగర



రామలింగేశ్వర్‌నగర్‌లో పార్కును పరిశీలిస్తున్న కమిషనర్

పరిధిలో దాదాపు ముప్పై వేల మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అంతకుముందు పాతబస్టాండు అన్న క్యాంటీన్, సీతారామ్‌నగర్‌లో పారిశుధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. కొండారెడ్డి బురుజు వద్ద ఉన్న పార్కులో లైటింగ్, వాటర్ ఫౌంటేన్‌లకు మరమ్మతులు చేపట్టి నైట్ వాచ్‌మన్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో హార్టికల్చర్ ఏడీ విజయలక్ష్మి, ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు, ట్రైనీ ఏఈ స్వాతి పాల్గొన్నారు.

మహిళలకు స్ఫూర్తి లక్ష్మి సెహగల్

కర్నూలు అర్బన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): నేటి మహిళలు కెప్టెన్ లక్ష్మి సెహగల్ పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని ఐద్వా జిల్లా కన్వీనర్ నిర్మల అన్నారు. బుధవారం ప్రభుత్వ డిగ్రీ బాలుర కళాశాలలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం, ఐద్వా సంయుక్త ఆధ్వర్యంలో కెప్టెన్ సెహగల్ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి ప్రిన్సిపాల్ ఇందిరా శాంతి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నిర్మల మాట్లాడుతూ లక్ష్మి సెహగల్ వంటి మహిళా నాయకులు సేవలు గుర్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలు, చరిత్రశాఖ అధ్యాపకులు వెంకటస్వామి, డాక్టర్ మాధవి, అరుణ, కమ్రిన్, డా. మాదన్న, రోషన్న, మీనాక్షి, శశికళ, విద్యార్థులు పాల్గొన్నారు.

కేరళ మాజీ సీఎం మృతి తీరని లోటు

గూడూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): సీపీఎం నేత, కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్ మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు అని సీపీఎం డివిజన్ కార్యదర్శి జే.మోహన్ అన్నారు. బుధవారం గూడూరు పట్టణం లోని సీపీఎం ఆధ్వర్యంలో సంతాప సభ ఏర్పాటు చేశారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం మండల కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, మధు, మద్దిలేటి, హమాలీ సంఘం నాయకులు సుంకన్న, రామాంజనేయులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులకు భయపడేది లేదు: ఎస్వీ

కర్నూలు న్యూసిటీ, జూలై 23(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వైసీపీ నాయకులపై చేస్తున్న అక్రమ అరెస్టులకు భయపడేది లేదని వైసీపీ జిల్లాఅధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎస్వీ కాంప్లెక్స్ సమావేశ భవనంలో నియోజకవర్గంలోని 13 నుంచి 25 వార్డుల నాయకు లు, కార్యకర్తలకు విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రజల్లో పూర్తిస్థాయిలో వ్యతిరేకత వచ్చిందన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు, అనుబంధ సంస్థ అధ్యక్షులు, వార్డు లీడర్లు, నాయకులు పాల్గొన్నారు.

టీబీ నిర్మూలనే లక్ష్యం

కోడుమూరు రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): టీబీ నిర్మూలనే తమ లక్ష్యమని జిల్లా లెప్రసీ, టీబీ అధికారి భాస్కర్ అన్నారు. బుధవారం మండలంలోని టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ టీబీ రహిత గ్రామ పంచాయతీగా ఎర్రదొడ్డి అవార్డు పొందడం గర్వకారణమన్నారు. రెండు వారాలకు పైగా జ్వరం, దగ్గు, బరువు తగ్గం, ఆకలి మందగించడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది లక్షణాలు ఉంటే వ్యాధి నిర్ధారణ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ మధుసూదన్ రెడ్డి, వైద్యాధికారి డా.భాస్కర్, డీహెచ్ ఈవో శ్రీనివాస యాదవ్, సూపర్‌వైజర్ శారద పాల్గొన్నారు.

విద్యార్థులు దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి



విద్యార్థినికి ప్రతిభా పురస్కారం అందజేస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదువుకుని దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య పిలుపునిచ్చారు. బుధవారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) కర్నూలు నగర శాఖ ఆధ్వర్యంలో ఉత్తమ విద్యార్థి ప్రతిభా పురస్కారోత్సవాన్ని నిర్వహించారు. నగరంలోని వివిధ కళాశాలలో మొదటి, రెండో స్థానంలో నిలిచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేసి సత్కరించారు. ఏబీవీపీ కర్నూలు విభాగ్ ప్రముఖ్ డా.ఎం.నాగమణి శాస్త్రి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య, అశ్విని హాస్పిటల్ ఎండీ శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొని విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో విభాగ్ కన్వీనర్ గేటు ఎర్రిస్వామి, జిల్లా కన్వీనర్ వీరేష్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ రవి తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌కుమార్ గుప్తాను కలిసిన మాజీ ఎమ్మెల్సీ



హరీశ్‌కుమార్ గుప్తాతో మహ్మద్ ఇక్బాల్

కర్నూలు స్పోర్ట్స్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐపీఎస్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హరీశ్‌కుమార్ గుప్తాను బుధవారం ఇన్స్‌పెక్టర్ ఆఫ్ పోలీస్ రాయలసీమ షేక్ మహ్మద్ ఇక్బాల్ ఐపీఎస్ మాజీ ఎమ్మెల్సీ మర్యాదపూర్వ కంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

నేడు చౌడేశ్వరీదేవికి పూజలు

కర్నూలు కల్చరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): చౌడేశ్వరీ దేవి ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం భక్తులు పూజలు నిర్వహించనున్నారు. నగరంలోని కల్లూరు రోడ్డులోని చౌడేశ్వరి మాత, సప్తగిరినగర్‌లోగల కొత్త అయ్యప్ప స్వామి ఆలయాల్లో గురువారం వేకువ జాము నుంచి పూజలు ప్రారంభిస్తున్నారు. ఆలయాల్లో ఉద యం నుంచి పంచామృతాభిషేకం, జ్యోతి ఉత్సవం, కుంకుమార్చనలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. బుధవారం కల్లూరు మండలం కొంగనపాడు, చెట్లమల్లాపురం గ్రామాల్లో నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు టీటీడీ సభ్యుడు మల్లెల రాజశేఖర్‌తో కలిసి ఆమె సుపరిపాలన తొలిఅడుగు కార్యక్ర మంలో పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు టి.వినోద్‌కుమార్, తిమ్మారెడ్డి, శివ, దామోదర్‌రెడ్డి, ఉలిందకొండ సొసైటీ చైర్మన్ ఈవీ.రమణ, ధనుంజయ, జాఫర్, కురుపాటి దేవేంద్రారెడ్డి, కరీం నాయకులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు చేరాలి: ఎమ్మెల్యే దస్తగిరి

కర్నూలు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి కుటుంబానికి చేరాలని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పేర్కొన్నారు. కర్నూలు మండలం గార్గేయపురం గ్రామంలో బుధవారం జరిగిన సుపరిపాలనతో తొలి అడుగు కార్యక్రమానికి ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కేడీసీసీబీ చెర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, కోడుమూరు నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు రామలింగారెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలు అభివృద్ధి చెందాలన్నదే సీఎం చంద్ర బాబు సంకల్పమని అన్నారు. విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి పేదల ప్రభు త్వమని వారికి అండగా ఉంటుందన్నారు. రామలింగారెడ్డి మాట్లాడుతూ చంద్రబాబుతోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. అంతకముందు వారు గ్రామంలో ఇంటింటికి వెళ్లి పింఛన్, రేషన్ అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు.

● గార్గేయపురం శివారులో హంద్రీనీవా కాలువకు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కేడీసీసీబీ చైర్మెన్ విష్ణువర్దన్‌రెడ్డి, కోడుమూరు నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు రామలింగారెడ్డి కలిసి జలహారతి ఇచ్చారు. పూజలు చేసి పసుపు కుంకుమ సారె నీటిలోకి వదిలారు. అనంతరం వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రాయలసీమలో రైతులను ఏమాత్రం పట్టించుకోలేదని, చుక్కనీరు లేక పంటలు ఎండిపోయి ఎడారిగా మార్చిందని విమర్శించారు. టీడీపీ నాయకులు పల్లె సీతా రామిరెడ్డి, నరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచు కౌలుట్లయ్య పాల్గొన్నారు.

కర్నూలు అర్బన్: కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ ధరూర్ జేమ్స్ అన్నారు. బుధవారం నగరంలోని 10వ వార్డులో సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు వి. హను మంతరావు చౌదరి ఆధ్వర్యంలో సుపరిపాలన తొలి అడుగులో భాగంగా బుధవారపేటలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిం చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చలపతి, రాము, డి.రాజేష్, ఆదాం పాల్గొన్నారు.

కోడుమూరు: కూటమి ప్రభుత్వంతో రాష్ట్రంలో సుపరిపాలన సాగుతోందని టీడీపీ మండల కన్వీనర్ రామక్రిష్ణారెడ్డి అన్నారు. మండలంలోని కొత్తూరు గ్రామంలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలు గురించి వివరించారు. అలాగే కోడుమూరు పట్టణంలో టీడీపీ నాయకులు మునిస్వామి ఆధ్వర్యంలో ఒకటో వార్డులోని ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోరంట్ల సర్పంచు బాలకృష్ణ, రఘుపతి, కమలాకర్, పరమేశ్వరయ్య, శ్రీనివాసులు, రామకృష్ణ, ఏసేపు, రమణ పాల్గొన్నారు.

సి.బెళగల్: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని బురాన్‌దొడ్డి జడ్పీ ఉన్నతపాఠశాల విద్యాకమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండలంలోని బురాన్‌దొడ్డిలో బూత్‌కమిటీలతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రామంజినేయులు, గోవిందు, రాంమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



ప్రజలకు కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి



గార్గేయపురంలో కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి, విష్ణువర్ధన్‌రెడ్డి

గూడూరు: సీఎం చంద్రబాబుతోనే సుపరి పాలన సాధ్యమని పట్టణ టీడీపీ అధ్యక్షుడు కురుకుంద రామాంజనేయులు అన్నారు. బుధవారం గూడూరు పట్టణంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ రేమట వెంకటేశ్వర్లు, నాయకులు మన్నన్ బాషా, నాగప్ప యాదవ్, కురువ హనుమంతు, పట్టణ తెలుగు యువత అధ్య క్షుడు వీర కుమార్, చాంద్‌బాషా పాల్గొన్నారు.

నేడు రాతనకు ఎమ్మెల్యే శ్యాంబాబు

తుగ్గలి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నేడు రాతనకు ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు రానున్నట్లు తెలుగు రైతు ఉపాధ్యక్షుడు మనోహర్ చౌదరి తెలిపారు. గురువారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించే 'సుపరిపాలనలో తొలి అడుగు'లో ఎమ్మెల్యే పాల్గొంటారన్నారు.

పేదల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న తుగ్గలి నాగేంద్ర

తుగ్గలి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి తిమ్మయ్య చౌదరి, బత్తిన వెంకట్రాముడు, మనోహర్ చౌదరి అన్నారు. బుధవారం మండలంలోని గిరిగిట్ల గ్రామంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' నిర్వహించారు. ఏడాది లోనే గ్రామాల్లో సీసీ రోడ్లు, గోకులం షెడ్లు నిర్మించామ న్నారు. రైతులకు డ్రిప్ పరికరాలను అందించామన్నారు. తిరుపాల్ నాయుడు, బలరాం, సతీష్, గిరిగిట్ల మల్లి, రంగస్వామి ఉన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు


పథకాలను ప్రజలకు వివరిస్తున్న టీడీపీ నాయకులు

ఆదోని, జూలై 23(ఆంధ్రజ్యోతి): నియోజవర్గంలోని ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను అందిస్తామని కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, టీడీపీ నాయకులు గుడిసె కృష్ణమ్మ, ఉమాపతి నాయుడు పేర్కొన్నారు. పట్టణంలోని మరాఠీగేరిలో బుధవారం 'సుపరిపాలనలో తొలి అడుగు' నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. శ్రీకాంత్‌రెడ్డి, రంగస్వామినాయుడు, శంకర్, రామస్వామి, గుడిసె శ్రీరాములు, నీలకంఠప్ప, అప్సర్‌బాషా, రంగన్న పాల్గొన్నారు.

నీరు కలుషితం కాకుండా చూడాలి


వాల్వ్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో విజయలక్ష్మి

మద్దికెర, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తాగునీరు కలుషితం కాకుండా చూడాలని డిప్యూటీ ఎంపీడీవో విజయలక్ష్మి సూచించారు. బుధవారం గ్రామంలో వాల్వ్‌లను పరిశీలించారు. వాల్వులు లీకేజీకి గురైతే ప్రజలు రోగాన బారినపడే ప్రమాదం ఉందన్నారు. పంచాయతీ కార్మికులు ఎప్పటికప్పుడు వాల్వులు, పైపులను తనిఖీ చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిరుపయోగంగా ఉన్న తాగునీటి పథకాలను బాగు చేయాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి శివకుమార్, సిబ్బంది ఉన్నారు.

సీఎం దృష్టికి ఉద్యోగుల సమస్యలు


ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

ఆదోని రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ ఉద్యోగుల సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళతానని ఎమ్మెల్సీ బీటీ నాయుడు హామీ ఇచ్చారు. బుధవారం ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్ ఆధ్వర్యంలో ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. జీతాల పెంపు, హెల్త్ కార్డులు, పీఆర్‌సీ, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. హనుమేష్, ఆనంద్, చంద్రశేఖర్, అయ్యన్న, శేకన్న ఉన్నారు.

'ఓపెన్' పది, ఇంటర్‌లో ప్రవేశాలు

ఆదోని అగ్రికల్చర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం(ఓపెన్ స్కూల్) పదో తరగతి ఇంటర్మీడియ ట్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం మల్లికార్జున, కో ఆర్డినేటర్ కొమ్ము ప్రసాద్ తెలిపారు. బుధవారం పాఠశాలలో నోటిఫికేషన్ విడుదల చేశారు. రెగ్యులర్‌గా చదువుకోవడానికి అవకాశం లేని పిల్లలు, బడి మధ్యలోనే వదిలేసిన వారు, వయోజనులు, పదో తరగతి, ఇంటర్ ఫెయిల్ అయిన వారు చదువుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింద న్నారు. వివరాలకు 9703475822 ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.


నోటిఫికేషన్ అందిస్తున్న కో ఆర్డినేటర్ ప్రసాద్

మైనార్టీ ఐటీఐ కళాశాలను ప్రారంభించాలి


సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆదోని అగ్రికల్చర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని ఆరేకల్లు గ్రామం వద్ద నిర్మించిన ప్రభుత్వ మైనార్టీ ఐటీఐ కళాశాలను వెంటనే ప్రారంభించాలని ఆర్‌పీవీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ, కార్యదర్శి ఖాజ డిమాండ్ చేశారు. బుధవారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. గత టీడీపీ హయాంలో రూ.కోట్లు ఖర్చు పెట్టి ఐటీఐ కళాశాల, హాస్టల్ భవనాన్ని నిర్మించారన్నారు. నిర్మాణం పూర్తయినా గత వైసీపీ ప్రభుత్వం ప్రారంభించలేదని, వెంటనే ప్రారంభించి ప్రవేశాలు కల్పించాలని కోరారు. రమణ, వీరేంద్ర పాల్గొన్నారు.

గదులు సరిపోక.. బోధన సాగక

• నిలిచిపోయిన తరగతి గదుల నిర్మాణం • ఆలూరు ప్రాథమిక, జడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల అవస్థలు


ఆలూరు ప్రాథమిక పాఠశాలలో అసంపూర్తి గదిలో విద్యార్థుల అవస్థ...


అసంపూర్తిగా ఉన్న ఉర్దూ పాఠశాలలో కూర్చున్న విద్యార్థులు

ఆలూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మండల పరిషత్ మెయిన్ ప్రాథమిక పాఠశాలకు గదులు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో ఒకటి నుంచి అయిదు తరగతులు ఉండగా, 250 మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే ఇంత మంది విద్యార్థులకు ఏడు తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. దీంతో గదులు సరిపోక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. పాఠశాలకు పదేళ్ల క్రితం రూర్బన్ నిధులతో అదనపు గది నిర్మాణన్ని ప్రారంభించారు. నిధుల కొరత కారణంగా పనులు ఆగిపోవడతో ఆ గదుల్లోనే నిలిచిపోవడంతో అందులోనే విద్యార్థులు చదువుతుకుంటున్నారు.

ఉర్దూ పాఠశాలలోనూ ఇదే పరిస్థితి...

అదే కాంపౌండ్‌లోనే జడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాల ఉంది. ఈ పాఠశాలలో కూడా గదుల కొరత వేధిస్తోంది. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు మొత్తం 75 మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే వీరికి 2 తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో 'నాడు నేడు' కింద నూతన భవనం నిర్మించినా పూర్తి కాలేదు. దీంతో ఆ గదిలోనే విద్యార్థులు చదువు సాగిస్తున్నారు. నిలిచిపోయిన భవనాన్ని పూర్తి చేయాలని, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



భవన నిర్మాణం పూర్తి చేయాలి

పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగింది. అయితే తరగతి గదుల కొరత తీవ్రంగా ఉంది. పదేళ్ల క్రితం నిర్మించిన అదనపు తరగతుల భవనం అసంపూర్తిగా ఉంది. అధికారులు స్పందించి పూర్తి చేయాలి. **- ఈరన్న, హెచ్‌ఎం, ఆలూరు మెయిన్ స్కూల్**

గదులు సరిపోవడం లేదు

పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 75 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. అయితే రెండు గదులు మాత్రమే ఉండటంతో బోధనకు ఇబ్బందులు వస్తున్నాయి. అసంపూర్తి భవనాల్లోనే బోధన కొనసాగించాల్సి వస్తోంది. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిధులు లేవంటున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలి. **- సావిత్రి, హెచ్‌ఎం, జడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాల, ఆలూరు**



తాగునీటి సమస్య పరిష్కరించరా?

ఆలూరు రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్యను ఎందుకు పరిష్కరించడం లేదని జడ్పీటీసీ సభ్యుడు ఏరూరు శేఖర్ అధికారులను ప్రశ్నించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రంగమ్మ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. బాపురం, విరుపాపురం స్కీం నుంచి ఆలూరు, ముద్దనగేరి గ్రామాలకు 15 రోజుల నుంచి నీరు రావడం లేదని, ఆలూరులో కూడా 10 నుంచి 15 రోజుల కోసారి సరఫరా చేస్తున్నారని సర్పంచ్ సుధాకర్‌రెడ్డి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామ్ లీలను ప్రశ్నించారు. ఎంపీడీవో మద్దిలేటి స్వామి మాట్లాడుతూ తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఏపీవో శ్రీనివాసులు, ఆర్ఐ బసవన్నగౌడ్, ఎఫ్‌బీవో బాలకృష్ణ, ఏపీఎం ఆంజనేయ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, సర్పంచ్ రాజశేఖర్, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తిలో రథయాత్ర

వెల్దుర్తి టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం రథయాత్ర నిర్వహించారు.నవంబరు 23న సత్య సాయిబాబా జయంతి సందర్భంగా చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సభ్యులు సాయిప్రసాద్, భక్తుజనులు పాల్గొన్నారు.

యోధుడు అచ్యుతానందన్

దేవనకొండ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కేరళ మాజీ సీఎం అచ్యుతనందన్ పోరాట యోధుడని సీపీఎం నాయకుడు వీరశేఖర్ అన్నారు. బుధవారం సీఐటీయూ కార్యాలయంలో అచ్యుతనందన్ సంతాప సభ నిర్వహించారు. పేదకుటుంబం నుంచి రాజకీయాల్లోకి వచ్చారని, ప్రజాశ్రేయస్సుకు మరణం వరకు పోరుబాట వీడలేదన్నారు

సబ్సిడీ పథకాలను వినియోగించుకోవాలి


డ్రాగన్ ఫ్రూట్ తోటను పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఆస్పరి, జూలై23(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ పథకాలను వినియోగించుకోవాలని ఎంపీడీవో గీతావాణి సూచించారు. బుధవారం కారుమంచి గ్రామంలో ఉపాధి పథకం కింద రైతు మల్లికార్జునగౌడ్ సాగుచేసిన డ్రాగన్‌ఫ్రూట్ తోటను పరిశీలించారు. తోటకు అవసరమయ్యే మొక్కలు, ఎరువులు, వ్యవసాయ ఖర్చులకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు. దిగుబడివ ప్రారంభం కావడంతో రైతు అవలంబించిన పద్ధతులను అడిగి తెలుసుకున్నారు ఉద్యాన పంటలను సాగు చేసి, దిగుబడి సాధించాలని సూచించారు. ఐదెకరాల్లోపు, ఉన్న రైతులకు మామిడి, దానిమ్మ, అరటి, జామ, ద్రాక్ష తదితర పంటలకు సబ్సిడీ కింద ఉపాధి పథకం నుంచి అందజేస్తామన్నారు. ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

రేపు చెరువులకు నీటి విడుదల

పత్తికొండ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఆలంకొండ వద్ద పంపింగ్ స్టేషన్ నుంచి చెరువులకు శుక్రవారం నీటిని విడుదల చేయనున్నట్లు ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు తెలిపారు. ఏర్పాట్లు చేయాలని బుధవారం హెచ్‌ఎన్ఎస్ఎస్ అధికారులకు సూచించారు. డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి పాల్గొంటారన్నారు. ఆలంకొండ నుంచి కటారికొండ హిల్‌స్టేషన్‌కు నీటిని లిఫ్ట్‌చేసి అక్కడి నుంచి చెరువులకు నీటిని మళ్లిస్తామన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్యాంబాబు

గోవుల తరలింపునకు యత్నం

ఆదోని టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రోడ్లపై ఉండి, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న గోవులను మున్సిపల్ అధికారులు బుధవారం గోశాలకు తరలించడానికి చర్యలు తీసుకున్నారు. నెల నుంచి యాజమానులకు అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నా ఫలితం కనిపించలేదు. దీంతో అధికారులు బుధవారం సాయంత్రం తరలించేందుకు ప్రయత్నించగా, కొందరు యజమానులు సిబ్బందితో ఘర్షణకు దిగారు. చివరకు పోలీసులు జోక్యం చేసుకోవడంతో పరిస్థితి సద్దుమణిగింది. స్వాధీనం చేసుకున్న గోవుల యజమానులకు రూ.వెయ్యి జరిమానా విధించి గోవులను విడిచిపెట్టారు. వారంలోపు యజమానులు ఇళ్ల వద్ద ఉంచుకోని పక్షంలో రూ.10 వేలు జరిమానాతోపాటు, వాటిని మంత్రాయయంలోని గోశాలకు తరలిస్తామని హెల్త్ ఆఫీసర్ డా. సందీప్ కుమార్ హెచ్చరించారు.


గోవులను తరలిస్తున్న సిబ్బంది

• అడ్డుకున్న యజమానులు

విరిగిన గాలిమర రెక్క

దేవనకొండ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.వెంకటాపురం గ్రామ సమీప పొలాల్లో బుధవారం ఉదయం గాలిమర (విండ్‌ఫ్యాన్) రెక్క ఊడి పడింది. గొల్ల కౌలుట్ల పొలంలో సెమ్ క్రాప్ కంపెనీ గాలిమర ఏర్పాటు చేసింది. బేరింగులు విరిగి కిందపడింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.


కిందపడిన గాలిమర రెక్క

పార్టీ కోసం పనిచేసే వారికే పదవులు

ఆలూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడేవారికే పదవులు వస్తాయని ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. బుధవారం పట్టణంలో ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల అమలును అడిగి తెలుసుకున్నారు. తల్లికి వందనం లబ్ధిదారులతో మాట్లాడారు. త్వరలోనే విభేదాలు సమసిపోతాయ న్నారు. తెలుగు రైతు కమిటీ రాష్ట్ర కార్యదర్శి నారాయణరెడ్డి, కన్వీనర్ అశోక్, నరసప్ప, కొమ్ము రామాంజనేయులు, ముద్దురంగ ఉన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న నాయకులు

కౌన్సిలర్లను విమర్శిస్తే సహించం

ఆదోని టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కౌన్సిలర్లను విమర్శిస్తే సహించమని అమరావతినగర్ కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ అన్నారు. బుధవారం మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ కృష్ణ, చైర్‌పర్సన్ లోకేశ్వరి వార్డులలో పర్యటిస్తూ, కౌన్సిలర్లను విమర్శించడాన్ని ఖండించారు. బుధవారం మాట్లాడుతూ, తమ వార్డులో పర్యటించే ముందు తమకెందుకు సమాచారం ఇవ్వడం లేదని ప్రశ్నించారు.

చికిత్స పొందుతూ మృతి

దేవనకొండ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పాముకాటుకు గురైన కరివేముల గ్రామానికి చెందిన రవికుమార్(21) చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన సుంకన్న, రంగమ్మ పెద్ద కుమారుడు రవికుమార్ ఇంట్లో నిద్రిస్తూ సోమవారం రాత్రి పాముకాటుకు గురయ్యాడు. కుటుంబసభ్యులు కర్నూలు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.


రవికుమార్(ఫైల్)

హంద్రీ-నీవా వరం

దేవనకొండ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ ప్రజలకు హంద్రీ-నీవా వరమని వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ అన్నారు. బుధవారం గుండ్లకొండ పంప్‌హౌస్ వద్ద హంద్రీనీవా నీటికి హారతి ఇచ్చారు. సీఎం చంద్రబాబు కృషితో ప్రజలకు నీరు అందుతోందన్నారు. మాజీ ఎంపీపీ రామచంద్ర నాయుడు, కన్వీనర్ విజయ బాస్కర్‌గౌడ్, గుండ కొండ రాందాస్ గౌడ్, మల్లికార్జునగౌడ్, ఉన్నారు.

మమ అనిపించారు

• మొక్కుబడిగా సమావేశం

మద్దికెర, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలాన్ని కేంద్ర ప్రభుత్వం నీతి ఆయోగ్ పథకానికి ఎంపిక చేసింది. దీంతో అభివృద్ధి కార్యక్రమాల అమలుకు బుధవారం ఎంపీడీవో సమావేశ భవనంలో మండల స్థాయి అధికారులు రౌండ్‌టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఏమాత్రం చర్చించకుండానే పట్టుమని పది నిమిషాల్లోనే ముగించి వెళ్లిపోయారు. ఇలా అయితే మండలం ఎలా అభివృద్ధి చెందుతుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎంపీడీవో కొండయ్య, డిప్యూటీ ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంఈవో రంగస్వామి, హౌసింగ్ ఏఈ ఉమాకాంత్, సీహెచ్‌వో నిరంజన్‌బాబు, ఏఈ విష్ణు వివిద శాఖ అధికారులు ఉన్నారు.

యూరియా కొరత రాకుండా చర్యలు తీసుకోండి

పత్తికొండ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలో యూరియా కొరత రాకుండ చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులను ఆర్డీవో భరత్‌నాయక్ ఆదేశించారు. బుధవారం కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. కొన్ని ప్రాంతాల్లో యూరియా కొరత ఉన్నట్లు రైతులు ఆందోళన చేస్తున్నారని, ఇకపై అలా జరగకుండా చూసుకోవాలన్నారు. వ్యాపారులు కృత్రిమ కొరతను సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.


వ్యవసాయాధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో

అభివృద్ధే ధ్యేయంగా పాలన

మద్దికెర, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగుతోందని జిల్లా టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు అన్నారు. బుధవారం మాట్లాడుతూ వైసీపీ నాయకులను అక్రమ అరెస్టులు చేస్తున్నారని ఆ పార్టీ నాయకులు ఆరోపణలు చేయడం సిగ్గు చేటన్నారు. నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలు తీసిన వారికి బుద్ధి చెప్పి, అరెస్టు చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. నాటి ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబును 54 రోజుల పాటు జైలులో పెట్టారన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తుందంటూ ఆరోపణలు చేస్తున్నారనీ, అయితే వైసీపీ హయాంలో హింసలకు పాల్పడలేదనా అని ప్రశ్నించారు. ఆవుల పెద్దన్న, చాకలి రంగన్న, బురుజుల మోహన్ ఉన్నారు.

ఎద్దు మృతి

తుగ్గలి, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామంలో విద్యుదాఘాతానికి గురై ఓ ఎద్దు మృతిచెం దింది. బాధిత రైతు తెలిపిన మేరకు.. బుధవారం ఎద్దును గుడిసెలో ఉంచి, రైతు మొట్టె సుంకన్న పొలంలో పనిచేసుకుంటున్నాడు. అంతలోనే ఎద్దుకు విద్యుత్ తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురైంది. విషయం తెలుసుకున్న గిరిజన సలహా మండలి సభ్యులు వెంకటపతి, జెడ్పీ మాజీ చైర్మన్ బత్తిన వెంకట్రాముడు, మాజీ ఎంపీపీ కొమ్మె వెంకటేశ్‌ల బాధిత రైతును పరామర్శించారు. ఎమ్మెల్యే శ్యాంబాబు దృష్టికి తీసుకెళ్లి సాయం అందేలా కృషి చేస్తామని తెలిపారు.

నేత్ర వైద్యాన్ని పునరురుద్ధరించాలి

పత్తికొండటౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ముఖ్యమంత్రి ఐ కేంద్రం కింద నేత్ర వైద్యాన్ని పునరురుద్ధరించాని డీవైఎఫ్ఐ మండలాధ్యక్షుడు దూదేకొండ దుగ్గెన్న డిమాండ్ చేశారు. బుధవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో భరత్‌నాయక్, ఆసుపత్రి సూపరింటెండెంట్ కల్పనకు వినతి పత్రం సమర్పించారు.

యాప్ ద్వారా పోషకాహారం పంపిణీ : సీడీపీవో

ఆదోని రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఇక నుంచి ఫేస్ యాప్ ద్వారానే ప్రభుత్వం పోషకారాలను పంపిణీ చేయనున్నట్లు ఆదోని సీడీపీవో ఉమామహేశ్వరి తెలిపారు. బుధవారం మాట్లాడుతూ నియోజకవర్గంలో 224 అంగన్‌వాడీ సెంటర్లు ఉండగా, బాంతలు, గర్భిణులు, పిల్లలు మొత్తం 16,072 మంది ఉన్నారన్నారు. ఫోన్ నెంబర్లకు ఆధార్ అనుసంధానం కానివారు తక్షణమే చేసుకోవాలని సూచించారు.


ఉమా మహేశ్వరి

'సుపరిపాలన'లో సమస్య పరిష్కారం


స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ఆదోని టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బావాజీపేటలో నిర్వహించిన 'సుపరిపాలనకు-తొలి అడుగు'లో గుర్తించిన సమస్య పరిష్కారం కావడంపై వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ ఇన్‌చార్జి మీనాక్షినాయుడు ఆధ్వర్యంలో ఇటీవల వార్డులో పర్యటించగా, మహిళలు తమ వార్డులో విద్యుత్ స్తంభాలు లేవని, విద్యుత్ తీగలు కిందకు ప్రమాదకరంగా ఉన్నాయని మీనాక్షినాయుడు దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన, మాజీ కౌన్సిలర్ తిమ్మప్ప విద్యుత్ అధికారులతో మాట్లాడి బుధవారం నూతన స్తంభాలు ఏర్పాటు చేయించారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

ఆదోని అగ్రికల్చర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బల్లేకల్లు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ పీఎస్‌హెచ్‌ఎంగా పదోన్నతి పొందిన ఎంసీ సుంకన్నను ఉపాధ్యాయులు గ్రామస్థులు బుధవారం సన్మానించారు. జడ్పీ పాఠశాల హెచ్‌ఎం సత్యన్న జోజప్ప మాట్లాడుతూ అంకితభావంతో విద్యాభివృద్ధికి కృషి చేశారన్నారు.

సీఎం చంద్రబాబుతోనే అవినీతి నిర్మూలన


కప్పట్రాళ్లలో కరపత్రాలు ఇస్తున్న టీడీపీ నాయకులు

దేవనకొండ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సీఎం చంద్రబాబుతోనే చంద్రబాబు తోనే అవినీతి నిర్మూలన సాధ్యమని టీడీపీ నాయకులు ఈదుల దేవబండ సుభాన్, కప్పట్రాళ్ల మల్లికార్జున అన్నారు. కప్పట్రాళ్ల గ్రామంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' నిర్వహించి సంక్షేమ పథకాలను వివరించారు. తల్లికి వందనంతో కుటుంబంలోని విద్యార్థుల కు వరంలాంటిదన్నారు. పెద్దకౌలుట్లయ్య, చింపి ఈరన్న, లాలప్ప, ఐటీడీపీ రామాంజ నేయులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పుష్కరిణి నిర్మాణ పనులు

• పరిశీలించిన పీఠాధిపతి



పుష్కరిణి పనులను పరిశీలిస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, జూలై 23(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి 354వ సప్తరాత్రోత్సవాలకు పుష్కరిణి పనులు పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తెస్తామని పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు తెలిపారు. బుధవారం శ్రీమఠం ఆధ్వర్యంలో భక్తులు ఇచ్చిన విరాళంతో నిర్మిస్తున్న పుష్కరిణి పనులను పరిశీలించారు. ఇప్పటికే అడుగు భాగంలో కాంక్రీట్ బెడ్డు, చుట్టూ కాంక్రీట్ గోడ పనులు, మెట్లు, చుట్టూ గోపురం, మధ్యలో శిలామండపం ఏర్పాటుకు శ్రీకారం చుడుతున్నారు. పనులు దాదాపు పూర్తికావస్తున్నాయి. తుంగభద్ర నదినుంచి నీటిని పంప్ చేసి పుష్కరిణిలో తెప్పోత్సవ సేవకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

రాఘవరాయుడికి స్వర్ణ కవచ సేవ



మంత్రాలయం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి బంగారు కవచం సమర్పణ సేవ రమణీయంగా సాగింది. బుధవారం ఆషాఢ చతుర్థశి శుభదినాన్ని పురస్కరించుకొని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో మఠం పండితులు బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన, పంచామృతాభిషేకం నిర్వహించారు. బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, బెంగళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలు, బంగారు కవచంతో చూడ ముచ్చటగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు.

వెండి కవచంతో పరుశురాముడికి అలంకరణ

మంత్రాలయం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో వెలసిన మంచాలమ్మ అమ్మవారి పక్కనే ఉన్న పరుశు రామునికి రెండు కేజీల వెండితో తయారు చేసిన ముఖ కవచాన్ని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అలంకరించారు. బుధవారం రాజశేఖర్‌గౌడు, నీలకంఠ గౌడు, నాగరాజగౌడులు ఒక కేజీ వెండి, అయ్యన్నగౌడు ఒక కేజీ వెండి విరాళంగా ఇవ్వగా మూలింటి రాఘవేంద్రగౌడు ప్రత్యేక శిల్పి కళాకారులతో పరుశురాముని ముఖ కవచాన్ని తయారు చేయించారు. రెండు అడుగుల ఎత్తు, ఒక్క అడుగు వెడల్పుతో ఆకర్షణీయంగా ఉన్న ముఖ స్వరూపాన్ని పీఠాధిపతి సంప్రోక్షణ చేసి పరుశురామునికి అలంకరించి పూజలు చేశారు. దాతలను పీఠాధిపతి ఆశీర్వాదించారు.

ఫుట్‌బాల్ క్రీడాకారులకు షూస్ పంపిణీ



క్రీడాకారులకు షూస్ పంపిణీ చేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మిగనూరు పట్టణంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ఫుట్‌బాల్ క్రీడాకారులకు షూస్ పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు సుధాకర్ రావు, ప్రధాన కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ దాత పాల శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో క్రీడాకారులకు ఫుట్‌బాల్ షూస్ అందజేశారు. కార్యక్రమంలో కోశాధికారి నటరాజ్‌రెడ్డి, నరసింహరెడ్డి, కురువ బీరప్ప, షఫీ, శ్రీనివాసులు, నరసింహా రాజు పాల్గొన్నారు.

పేదల పక్షాన నిరంతర పోరాటం



పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

గోనెగండ్ల, జూలై 23(ఆంధ్రజ్యోతి): పేదల పక్షాన సీపీఐ నిరంతరం పోరాటం చేస్తోందని ఆ పార్టీ సీనియర్ నాయకులు మద్దిలేటినాయుడు అన్నారు. బుధవారం గోనెగండ్లలో సీపీఐ నాయకుల సమావేశం నిర్వహించారు. సీపీఐ, రైతుసంఘం నాయకులు మాట్లాడుతూ పేదల పక్షాన నిలబడి వారి ఉన్నతికి నిరంతరం పాటు పడుతుందని తెలిపారు. 24వ జిల్లా మహాసభలను ఆగస్టు 9,10,11 తేదీల్లో కర్నూలులో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్, కరపత్రాలను వారు విడుదల చేశారు. సమావేశంలో సీపీఐ నాయకులు కటికేమాలిక్, శ్రీరాములు, శివరామాంజి, బడేసా, మద్దిలేటి, లింగయ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో వర్షం

ఎమ్మిగనూరు రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది. వారం రోజులుగా వర్షం కురిసేలా మేఘాలు వస్తున్నప్పటికీ కురువలేదు. దీంతో పత్తి పంటను సాగు చేసిన రైతులు ఆకాశంవైపు వేచి చూశారు. అయితే బుధవారం రాత్రి కురిసిన ఓ మోస్తరు వర్షానికి రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మిగనూరు మండలంలో సిరాల్‌దొడ్డి, కడిమెట్ల, పరమాన్‌దొడ్డి, వెంకటగిరి, బనవాసి, గుడికల్ తదితర గ్రామాల్లో మోస్తరు వర్షం కురిసింది.

వ్యక్తిపై కేసు నమోదు

ఎమ్మిగనూరు టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో జరిగిన బైక్ ప్రమాదానికి కారణం అయిన వ్యక్తిపై కేసు నమోదు చేశారు. పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ ఎర్రన్న తెలిపిన వివరాల మేరకు ఈ నెల 19న బాబు ఫంక్షన్ హాల్ సమీపంలో శెట్టి బలిజ రంగస్వామి అనే వ్యక్తి బైక్‌పై తన ఇంటికి వెళ్తుండగా అటుగా వస్తున్న ముగతికి చెందిన నాగరాజు బైక్‌పై రాంగ్ రూటులో వచ్చి రంగస్వామి బైక్‌ను ఢీకొట్టాడు. దాంతో అతను తీవ్ర గాయాలు అయ్యాయి. మూడు రోజులుగా చికిత్స పొందుతున్నాడు. బుధవారం రంగస్వామి భార్య పార్వతి పట్టణ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

శరవేగంగా ఎంవీఎస్ పనులు

• గత వైసీపీ ప్రభుత్వంలో నిలిచిన పనులు
• అధికారంలోకి రావడంతో నిధులు పెంచి మళ్లీ పనులు చేపట్టిన టీడీపీ ప్రభుత్వం

గోనెగండ్ల, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని 11 గ్రామాలకు తాగునీటి సమస్య పరిష్కరించేందుకు అప్పటి టీడీపీ ప్రభుత్వం మల్టీ విలేజస్ స్కీం(ఎంవీఎస్) కింద రూ. 13.50 కోట్లు విడుదల చేసింది. గాజుల దిన్నె ప్రాజెక్టు సమీపంలో ఎంవీఎస్‌కు అప్పటి జనవనరుల శాఖ 75 సెంట్ల స్థలాన్ని కేటాయించింది. ఈ పనులను అప్పటి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి 2017 ఏప్రిల్‌లో భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈపథకం కింద హెచ్ కైరవాడి, గాజులదిన్నె, పుట్టపాశం, పెద్దనేలటూరు, ఎర్రబాడు, కులుమాల గ్రామాల్లో ఓహెచ్ ఆర్ ట్యాంక్‌లు నిర్మాణ పనులు కూడా చేపట్టారు. 2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారులోకి రావటంతో ఈ పథకానికి సంబంధించిన పనులు ఎక్కడివి అక్కడే నిలిచిపోయాయి. టీడీపీ ప్రభుత్వం



శరవేగంగా జరుగుతున్న ఓహెచ్‌బీఆర్ ట్యాంక్ పనులు

అధికారంలోకి రాగానే రూ. 13.50 కోట్ల నుంచి రూ. 19.50 కోట్లు నిధులు కేటాయించి అదనంగా మరో 3 గ్రామాలను చేర్చి 14 గ్రామాలకు నీరు అందించేందుకు నిర్ణయించారు. ఓహెచ్‌బీఆర్, ఇన్‌టెక్‌వెల్, ఓహెచ్ఆర్, 5ఎంఎల్‌డీ ఫిల్టర్ పనులు, 44 కిలోమీటర్ల పైప్ లైన్ పనుల శరవేగంగా జరుగుతున్నాయి.



ట్యాంక్ పనులను పరిశీలిస్తున్న అధికారులు

కూటమి ప్రభుత్వ ఘనతనే..



గాజులదిన్నెఎంవీఎస్‌స్కీం పనులకు గాను 2017లో అప్పటి టీడీపీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. చాలా వరకు పనులు పూర్తయ్యాయి. వైసీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పనులు నిలిచిపోయాయి. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిధులను పెంచి పనులను ప్రారంభించింది. పనులు పూర్తయితే 14గ్రామాలకు నీటి సమస్య ఉండదు.

• రామకృష్ణ, రాష్ట్ర కురువ కార్పొరేషన్ డైరెక్టర్, గాజులదిన్నె

పనులు త్వరగా పూర్తి చేస్తాం



ఎంవీఎస్ స్కీం కింద చేపట్టిన పనులకు నిధులు పెరిగాయి. వేగంగా పనులు చేపడుతున్నాం. ఇప్పటికి దాదాపు సగం పనులు పూర్తి అయ్యాయి. పనులు పూర్తి చేసి 14 గ్రామాలకు తాగునీరు అందిస్తాం.

• శ్రీనివాసరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, గోనెగండ్ల

రైతుల అభివృద్ధే టీడీపీ లక్ష్యం

గోనెగండ్ల, జూలై 23(ఆంధ్రజ్యోతి):రైతుల అభివృద్ధే టీడీపీ ప్రధాన లక్ష్యమని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం హెచ్ కైరవాడి సహకార సంఘం ఆవరణంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం మండల పాలక వర్గ సభ్యుల ప్రమాణా స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. సహకార సంఘం అధ్యక్షుడిగా బీ తిమ్మారెడ్డి, డైరెక్టర్లుగా ఎం ఆనంద్, బీ పెద్దవెంకట రాముడుతో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా తిమ్మారెడ్డి మాట్లాడుతూ రైతులకు సకాలంలో అందుబాటులో ఉంటానన్నారు. రుణాలు, ఎరువులు అందిస్తామన్నారు. ఎమ్మెల్యే తమపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము కానివ్వమన్నారు. ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మిగనూరు మార్కెట్‌యార్డు చైర్మన్ మల్లయ్య, గోనెగండ్ల సింగిల్ విండో అధ్యక్షుడు రామాంజినేయులు, టీడీపీ మండల కన్వీనర్ తిరుపతయ్యనాయుడు, రాజేష్, కైరవాడి జయరామ్‌గౌడ్, శ్రీనివాసులు, టీడీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



సహకార సంఘం అధ్యక్షుడిగా తిమ్మారెడ్డితో ప్రమాణం చేయిస్తున్న ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి

జింకల నుంచి పొలాలను కాపాడాలి



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

ఎమ్మిగనూరు టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : కర్నూలు జిల్లాలో జింకల నుంచి పంటల పొలాల కాపాడాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో జిల్లా కమిటీ సమావేశంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు ఓవైపు వర్షాలు ఎప్పుడు పడుతాయని ఎదురు చూస్తుంటే వేసిన విత్తనాలను జింకలు తినడంతో పెట్టిన పెట్టుబడి కోల్పోయి రైతు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాడని అన్నారు. నాయకులు వాగ్దానాలు చేయడం తప్ప రైతుల సమస్యలకు పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫారెస్ట్ అధికారులు జోక్యం చేసుకొని జింకలు పొలాలపై రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఇప్పుడిప్పుడే వర్షాలు పడుతుండడం వల్ల యూరియా కొరత వల్ల రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకొని యూరియాను అందుబాటులో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షులు హనుమంతు, కోటకోండ సూరి తదితరులు పాల్గొన్నారు.

ఆటస్థలాన్ని బాగు చేయండి



ఎంఈవో-2 రామ్మూర్తికి వినతి పత్రం అందజేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

పెద్దకడుబూరు , జూలై23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆట స్థలాన్ని బాగు చేయించాలని ఏఐవైఎఫ్ నాయకులు జాఫర్, మహ్మద్ ఉసేన్ డిమాండ్ చేశారు. బుధవారం ఎంఈవో-2 రామ్మూర్తిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆట స్థం కోసం ప్రభుత్వం రూ. ఐదులక్షలను కేటాయిందన్నారు. ప్రధానోపాధ్యాయురాలు ఉమా రాజేశ్వరమ్మ ఆ నిధులతో తూతు మంత్రంగా పనులు చేసి వదిలేశారన్నారు. దీంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రన్నింగ్ ట్రాక్ ఇరువైపులా చిన్నపాటి గోడను నిర్మించి ట్రాక్ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. కానీ గరుసుతో ట్రాక్ వేసి వదిలేశారన్నారు. ఆట స్థలం గుంతల మయంగా ఉండడంతో ఇబ్బందులకు గురువుతున్నారన్నారు. నామమాత్రంగా పనులు చేసి నిధులు దుర్వినియోగం చేసిన ప్రధానోపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలన్నారు.

శాస్త్రీయ విద్యావిధానం కోసం పోరాటం చేయాలి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు

గోనెగండ్ల, జూలై 23(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ విద్యావిధానం, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిఉదయ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ ప్రయోజనం కోసం విద్యారంగాన్ని నాశనం చేస్తున్నాయని ఆరోపించారు. విద్యార్థులకు విద్యను బోధించకుండా కాషాయం విద్యావిధానాన్ని అమలు చేస్తున్నారన్నారు. వాటిని తిప్పి కొట్టడానికి విద్యార్థులు ఏకం కావాలని కోరారు. ఈనెల 26,27 తేదీల్లో ఎమ్మిగనూరులో ఎస్ఎఫ్ఐ ప్లీనరీ సమావేశాలు నిర్వహించనున్నామని, విజయవంతం చేయాలని కోరారు. అనంతరం మండల ఎస్ఎఫ్ఐ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల శాఖ అధ్యక్షుడిగా రాయాజ్, కార్యదర్శిగా పవన్, తేజా, మరో 10 మంది సభ్యులు ఎన్నికయ్యారు.

అచ్యుతానందన్ ఆశయ సాధన కోసం కృషి చేద్దాం: సీపీఎం



అచ్యుతానందన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్ ఆశయ సాధన కోసం కృషి చేద్దామని సీపీఎం నాయకులు గోవిందు, రాముడులు అన్నారు. బుధవారం స్థానిక సుందరయ్య భవన్‌లో అచ్యుతానందన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో ఆయన పాల్గొన్నారన్నారు. 80 ఏళ్ల సీపీఎం పార్టీకి, ప్రజలకు తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. ప్రతి కార్యకర్తకు ఆదర్శం, మార్గదర్శమని అన్నారు. కార్యక్రమంలో నామాల రాముడు, వలి, రఘు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటకు సీఎంకు ఆహ్వానం

• ఆహ్వానపత్రికను అందజేసిన శ్రీమఠం అధికారులు

మంత్రాలయం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి 354 సప్తరాత్రోత్సవాలకు కర్ణాటక రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను ఆహ్వానిస్తూ మఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపి నరసింహ మూర్తి, కృష్ణ కౌశిక్ ఆహ్వానపత్రికను అందజేశారు. బుధవారం బెంగ ళూరులోని సీఎం నివాసంలో సిద్ధరామయ్యను మర్యాద పూర్వకంగా కలిశారు. కర్ణాటక మైనర్ ఇరిగేషన్ శాఖ మంత్రి బోషరాజుకు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్రకు వేరువేరు సమయాల్లో ఆహ్వానపత్రికను అందజేసి పీఠాధిపతితో ఫోన్‌లో మాట్లాడించారు. పీఠాధిపతి ఇచ్చిన రాఘవేంద్రస్వామి జ్ఞాపిక, శేషవస్త్రం, పరిమళ ప్రసాదం అందజేశారు.



కర్ణాటక సీఎంకు ఉత్సవాలకు ఆహ్వానిస్తున్న శ్రీమఠం అధికారులు

ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు కృషి

• ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి
• హెచ్ కైరవాడిలో 'తొలి అడుగు'



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ

గోనెగండ్ల, జూలై 23(ఆంధ్రజ్యోతి): రాయలసీమ ప్రాంతంలోని అన్ని ప్రాజెక్టులను పూర్తిచేసేందుకు టీడీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని హెచ్ కైరవాడి గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు ముందు గ్రామాలలో రూ. 18లక్షలతో నిర్మించిన ఉర్దూ పాఠశాల భవనాన్ని ఎమ్మెల్యే బీవీ ప్రారంభించారు. అలాగే పలు కాలనీలో రూ. 35 లక్షలతో సీసీరోడ్డు డ్రైనేజి పనులకు భూమిపూజ చేశారు. అనంతరం ఇంటింటికి తిరిగి టీడీపీ చేపట్టిన పలు సంక్షేమ పథకాలను వివరించారు. గత వైసీపీ ప్రభుత్వంతో గ్రామాల అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఎంవీఎస్ స్కీం కింద రూ. 19.5 కోట్లుతో 14గ్రామాలకు తాగునీటి పథకంను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. మండలంలో కూడా జలజీవన్ మిషన్‌తో తాగునీటి సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. టీడీపీ పాలనలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని అన్నారు. ఏడాది కాలంలో గోనెగండ్లలోని మండలంలోని పలు గ్రామాలలో రూ. 4.65కోట్లతో సీసీ రోడ్డు, డ్రైనేజి ఏర్పాట చేశారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ తిరుపతయ్యనాయుడు, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డు చైర్మన్ మల్లయ్య, సహకార సంఘాల అధ్యక్షులు తిమ్మారెడ్డి, రామాంజినేయులు టీడీపీ నాయకుడు రాజేష్, పలు గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి ఉత్సవ రథానికి ఘనస్వాగతం



రథానికి స్వాగతం పలుకుతున్న పట్టణ ప్రముఖులు

ఎమ్మిగనూరు జూలై23(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని బుధవారం ఎమ్మిగనూరు పట్టణానికి వచ్చిన రథానికి పట్టణప్రజలు ఘనస్వాగతం పలికారు. స్థానిక శివసర్కిల్‌లో మహిళలు సాయిబాబా చిత్రపటానికి పూజలు నిర్వహించి కలశాలతో స్వాగతం పలికారు. రథం ఆర్టీసీ బస్టాండ్, శివసర్కిల్, సోమప్ప సర్కిల్ మీదుగా పట్టణ ప్రధాన రహదారుల గుండా సాగింది. పలువురు సత్యసాయిబాబా భక్తులు దర్శించుకున్నారు. ఎంజీ పెట్రోల్ బంకుదగ్గర హారతి ఇచ్చి వీడ్కోలు పలికారు. రథయాత్రలో సత్యసాయి సంస్థ జిల్లా అధ్యక్షులు కృష్ణారెడ్డి, కన్వీనర్ అశోక్, సేవాదళ్ ప్రతినిధులు సూర్యనారాయణరెడ్డి, పట్టాభిరామ్, హరి, వీహెచ్‌పీ ప్రతినిధులు సత్యనారాయణరెడ్డి, మాచాని సోమప్ప ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు, ప్రముఖ వైద్యులు గౌడప్ప గౌడ్, నవీన్ గౌడ్ కుటుంబ సభ్యులు, తారకేష్, పట్టణప్రజలు పాల్గొన్నారు.

సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం

పెద్దకడుబూరు , జూలై23(ఆంధ్రజ్యోతి): సంక్షేమం, అభివృద్ధి సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ నాయకులు సత్యన్న గౌడ్, శివ, జనార్దన్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని మురవణి గ్రామంలోని సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం దశాబ్ద కాలం వెనక్కి వెళ్లిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో రామలింగ, శ్రీనివాసులు, నరసింహులు, చెన్నకేశవ, సురేష్ పాల్గొన్నారు.